నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
ఆదివారం | 31 మార్చి 2024 | www.navatelangana.com

మాజీ ఎంపీటీసీ కూతురి ఆఫ్ శారీ ఫంక్షన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి కూతురి ఆఫ్ శారీ ఫంక్షన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన సతీమణి అనుపమ, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు సుధాకర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. పండరి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల ఇంగ్లీష్ మీడియం బాలుర పాఠశాల్లోని పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాఠశాల విద్యార్థులు మొదటి పరీక్షను మొదలుకొని నేటి చివరి పరీక్ష వరకు ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు. చివరి రోజైన శనివారం పరీక్ష రాసి సెంటర్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఆనందంగా కనిపిస్తూ ఒకరినొకరు కరచాలనం చేసుకున్నారు. స్థానికంగా హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు సంతోషంగా తమ తమ ఇళ్లకు ప్రయాణమయ్యారు. మొత్తం మీద పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.



జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కి శిక్షణ

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ అసెంబ్లీ నియోజకవర్గ వర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ (దుబ్బాక ఎఆర్వో) గరిమా అగర్వాల్ హజరయ్యారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ అయోధ్య రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం మీకు అందజేయబడిన పిపిటి - హండ్ బుక్ నీ పూర్తిగా చదివి అర్థం చేసుకోని బుక్‌ని ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలన్నారు. ఈవీఎం మిషన్లలో బాలెట్ యూనిట్, వివి ప్యాడ్, కంట్రోల్ యునిట్ అనుసందాన ప్రక్రియ మరియు పోలింగ్ డే రోజు మాక్‌పోల్ ప్రక్రియ పలు పత్రాలు నింపే విధానం గూర్చి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. చాలా మంది అధికారులు ఇదివరకు ఎలక్షన్ విధులు చేశాం అని నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ప్రతీసారి ఈసీఐ కొత్త కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు ట్రెనింగ్ క్షుణ్ణంగా అందివ్వాలి అన్నారు .ఎలాంటి సందేహాలు ఉన్నా బుక్‌లో నోట్ చేసుకుని పైఅధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, డిపిఓ దేవకీ దేవిపాల్గొన్నారు.

కోడ్ తిప్పలు

- పెండ్లిళ్లు, శుభకార్యాల్లో నగదు చెల్లింపులకు ఇబ్బందులు
- రూ.10 లక్షల బ్యాంకు లావాదేవీలపై ఆరా
- రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు
- చెక్‌పోస్టుల వద్ద పట్టుపడుతున్న డబ్బు, నగలు
- ఎన్నికల కోడ్ అమల్లో పోలీస్ యంత్రాంగం
- ఈ నెల 25 నుంచి ఏప్రిల్ మాసమంతా పెళ్లిళ్లు
- చేతికొస్తున్న పంట దిగుబడులు
- రిజిస్ట్రేషన్లు, వ్యాపారాలకు కోడ్ కష్టాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

> ఎన్నికల కోడ్ వల్ల అనేక తిప్పలు తలెత్తుతున్నాయి. సుదీర్ఘ కాలం కోడ్ అమల్లో ఉండడం వల్ల పలు అభివృద్ధి పనులకు ఆటంకమే కాకుండా సంక్షేమ పథకాలకూ అడ్డు అవుతున్నది. ముఖ్యంగా ప్రజల వ్యక్తిగతమైన జీవితంపై కూడా కోడ్ ప్రభావం తీవ్రంగా పడుతుంది. వేసవిలో పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో నగదు చెలామణికి కోడ్ ఆటంకంగా మారుతోంది. బ్యాంక్ లావాదేవీలపై కూడా ఆంక్షలు ఉండడంతో రిజిస్ట్రేషన్లు, వ్యాపారాలకు కూడా ఇబ్బందులేర్పడుతున్నాయి. రెండు నెలల పాటు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటున్నందున పెళ్లిళ్లు, వైద్య ఖర్చులు, రిజిస్ట్రేషన్ల వంటి అత్యవసరాలకు సంబంధించి కూడా గట్టి నిఘా పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ జారీ చేసినింది మొదలు తెలంగాణ రాష్ట్రంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ముగిసే నాటికి రెండు నెలల సమయమిచ్చారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ షురూ కానుంది. జూన్ 4న దేశ వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ తర్వాతి రోజు నుంచి ఎన్నికల కోడ్ ముగియనుంది. ఇంత సుదీర్ఘ కాలం ఎన్నికల కోడ్‌ను అమలు చేయడం వల్ల రాజకీయ నాయకుల్ని కట్టడి చేయడం ఏమో కానీ..! సామాన్య ప్రజల్ని మాత్రం తిప్పలకు గురి చేస్తున్న పరిస్థితి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు చోట్ల చెక్‌పోస్టులు పెట్టారు. అంత రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులు పెట్టారు. ప్రతి చోటా స్పెషల్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువుల్ని తరలిస్తే ఆధారాల్లేవని సీజ్ చేస్తున్నారు.

ఏప్రిల్, మే నెలల్లో విపరీతంగా పెండ్లిళ్లు..

వివాహ శుభముహూర్తాలకు మంచి రోజుల్లేక పోవడంతో మూడు నెళ్లగా పెళ్లిళ్లు జరగలేదు. ఈ నెలలో కొన్ని ముహూర్తాలతోనే పెళ్లిళ్లు జరిగాయి. ఈ నెల 25, 28, 29, 30 తేదీలతో పాటు ఏప్రిల్ మాసంలో 1వ తేదీ నుంచి వరుసగా 24 వరకు పెళ్లిళ్లున్నాయి. శుభ ముహూర్తాలు చూసుకుని పెళ్లిళ్లు ఖరారు చేసుకున్నరు. పెళ్లి కోసం ఫంక్షన్‌హాల్స్, బ్యాండ్‌మేళం, డెకరేషన్, వంటలు, మటన్, చికెన్, బంగారం, వెండి, ఇతర పర్నీచర్, బట్టలు, రవాణా కోసం బస్సులు వీటన్నింటికీ వివాహం సందర్భగా ఖర్చు చేయాలి. వీటితో పాటు వదువరులకు కట్నకానుకల కింద నగదు కూడా చెల్లిస్తుంటారు. ఇదంతా సహజంగా జరిగే కార్యక్రమాలు కానీ..! ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఏదీ సాఫీగా సాగని పరిస్థితులెదురవుతున్నయి. ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.50 వేల నగదు కంటే ఎక్కువ తీసు కెళ్లాంటూ తగిన పత్రాలు చూపించాలి. అట్టి డబ్బులు ఎవరి స్తున్నారు..? అవి ఎవరి నుంచి వచ్చాయి..? అనేది ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. పెళ్లి కోసం కూడబెట్టుకున్న సొమ్ముకు కూడా ఆధారాలు చూపడం సాధ్యం కాదు. కానీ..! డబ్బు తీసుకెళ్తుంటే పోలీసులు చెక్‌పోస్టుల వద్ద, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ పట్టుకుని సీజ్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ కూడా ఇవే ఇబ్బందులు తలెత్తాయి. ఈ సారి పెళ్లిళ్ల సీజన్‌లో ఎన్నికల కోడ్ రావడంతో ప్రతీదీ సమస్యగా మారుతోంది. ఫంక్షన్‌హాల్స్ అడ్వాన్స్, బంగారం, వెండి, పర్నీచర్, బట్టల కొనుగోలు చేయడానికి ఆన్‌లైన్ పేమెంట్స్ తప్ప నగదు ఇచ్చే పరిస్థితి లేదు. చాలా మంది తల్లిదండ్రులకు స్మార్ట్‌ఫోన్ లేకపోవడం, ఉన్నా ఆపరేట్ చేయడం కాకపోవడం, గుగుల్‌పే, ఫోన్‌పేల్లో చెల్లిస్తే రూ.10 లక్షలకు మించితే కూడా ఆ ఎకౌంట్స్‌పై నిఘా పెట్టి విచారణకు పిలవడం వల్ల సమస్యలు వస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పెళ్లికార్డు చూసి ఆ కుటుంబానికి మినహాయింపు ఇవ్వాలని మనోహర్‌గౌడ్ తెలిపారు. ఏప్రిల్ 4న తన ఇంట్లో పెళ్లి ఉన్నందన నగదు విషయంలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు.

రిజిస్ట్రేషన్లు, వ్యాపారాలకూ...

ప్లాట్స్, భూముల కొనుగోలు విషయంలోనూ ఎన్నికల కోడ్ ప్రభావం పడుతోంది. ప్లాట్స్, భూమి కొనుగోలు చేసే వాళ్లు అమ్మేవాళ్లు ఇద్దరు కూడా లక్షల్లో నగదు తీసుకెళ్లాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ ధరలు అధికంగా ఉంటాయి. అదనంగా నిర్ణయించే ధరకు చెల్లించే డబ్బులకు ఏలాంటి ఆధారాలు చూపడం వీలుకాదు. దీంతో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందగించిందని రియల్టర్లు పేర్కొంటున్నారు. అదే విధంగా పెట్రోల్ బంక్‌లు, బట్టల దుకాణాలు, మోర్స్, బంగారం, హర్డ్‌వేర్, హోటల్స్, బార్స్, వైన్స్‌ల వంటి వ్యాపారాల విషయంలోనూ రోజువారిగా వచ్చే కౌంటర్ సేల్ డబ్బుల్ని సంబంధిత ఓనర్స్ కాకుండా నమ్మకస్తులైన సూపర్‌వైజర్స్, ఉద్యోగులు చూస్తుంటారు. ఏ రోజుకారోజు వచ్చిన డబ్బుల్ని బ్యాంకులో వేయడం వీలుకాదు. కౌంటర్‌లో డబ్బుల్ని రాత్రిపూట ఉంచడం కష్టం. దీంతో దుకాణాలు కట్టేసి డబ్బుల్ని ఇంటికి తీసుకెళ్లే సమయంలోనూ తనిఖీల్లో పట్టుపడుతున్న పరిస్థితి ఉంది.



ఇటీవలే గజ్వేల్‌లో పట్టుబడిన రూ.50లక్షల నగదు..

పంటల దిగుబడుల అమ్ముకునే రైతులకూ...

యాసంగి పంటలు చేతికొస్తున్నాయి. ఇప్పటికే చెరకు పంట కోత పూర్తయ్యింది. మిల్లులు రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారు. రైతులు తమ అవసరాల కోసం రూ.50 వేలకు మించి తీసుకెళ్లడం ఇబ్బందిగా మారింది. వరి కోతలు కూడా షురూ కానున్నాయి. ఏప్రిల్‌లో ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగితే రైతు చేతికి డబ్బులొస్తాయి. ఇతర మెట్ట పంటలు, మామిడి, సపోట, బత్తాయ, జామ వంటి తోటల్లో కాయ తెంపతున్నారు. కౌలుదారులు, వ్యాపారులు రైతులకు డబ్బులు చెల్లించాలి. నగదు లావాదేవీల విషయంలో రూ.50 వేలకు మించితే పట్టుపడుతాయనే భయం రైతుల్ని వెంటాడతుంది. ఐకేపీ కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి మాత్రమే బ్యాంకుల్లో డబ్బులు జమచేస్తారు. మిల్లర్లకు వ్యాపారులకు విక్రయించే సరుకుకు నగదుగానే చెల్లిస్తారు.



డైట్ బిల్లులు రిలీజ్ చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

డైట్ బిల్లులు వెంటనే రిలీజ్ చేయాలని కోరుతూ బీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీడీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట ఆనంద్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ హాస్టల్స్‌కి సుమారు 7 నుంచి 8 నెలల డైట్ బిల్లులు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. దాంతో అటు విద్యార్థులు, ఇటు వార్డెన్స్ అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సుమారు 4 హాస్టల్స్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. బిల్లులు రాక.. అద్దె కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్క వార్డెన్ హాస్టల్ నడపడానికి సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డైట్ బిల్లులు రిలీజ్ చేయకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ హాస్టల్స్ మూతపడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ధరల కనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తదితరులు శివరాత్రి , శ్రీనివాస్‌లు పాల్గొన్నారు..

బీబీ పాటిల్‌ను ఓడించండి

- తన కంపెనీలు, వ్యాపారాలు, ఆస్తులు కాపాడుకోవడం కోసమే పార్టీ మార్పు
- ఖేడ్ సమావేశంలో మాజీ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



తన కంపెనీలు, వ్యాపారాలు, ఆస్తులు కాపాడుకోవడం కోసమే బి.బి పాటిల్ బీజేపీలో చేరారని.. కాబట్టి ఆయన్ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నహాక సమావేశాన్ని స్థానిక కింగ్స్ ప్యాలెస్‌లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... బి.బి పాటిల్‌కు ఏం తక్కువ చేశామని ప్రశ్నించారు. 10 ఏండ్లు పుక్యానికి ప్రజలకు పట్టించుకోకుండా.. మోసం చేశారని ఆరోపించారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పట్టించుకోని బీ.బీ పాటిల్‌ను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల కోసం బీజేపీలోకి పోలేదని.. తన వ్యాపారాలు, ఆస్తులు కాపాడుకోవడానికే వెళ్లారని ఆరోపించారు. రాముని పేరు చెప్పి బీజేపీ ఓటు ఎందుకు అడుగుతున్నదని.. ప్రజా సమస్యల మీద ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. ప్రజలు రేవంత్ రెడ్డికి అవకాశం ఇచ్చారని.. కేసీఆర్ కంటే ఎక్కువ పని చేస్తాడని నమ్మితే మోసం చేశారన్నారు. రైతుబంధు ఇస్తా, రైతు బీమా ఇస్తా, కౌలు రైతలకు రూ.12,000 ఇస్తా, 24 గంటల కరెంటు ఇస్తా, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తా, 18 ఏండ్లు నిండిన మహిళలకు రూ.2500 ఇస్తా, రెండువేల పింఛన్‌ను రూ.4000గా ఇస్తా, సిలిండర్ ఇస్తా, రైతు మద్దతు ధర బోనస్ 500 ఇస్తా అని రేవంత్‌రెడ్డి ఎన్నో ప్రగల్బాలు పలికారని.. కానీ ఏ ఒక్కటి సరిగా అమలు చేయట్లేదని దుయ్యబట్టారు. అనంతరం మహారెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గాలి అనిల్ కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని.. కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. మీకోసం ఎల్లవేళలా పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని.. తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, శ్రేయ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ రూబీ నజీబ్, టౌన్ అధ్యక్షులు నగేష్ మండల అధ్యక్షులు పరమేష్, రవీందర్ నాయక్ జెడ్పిటిసి ప్రభాకర్ విట్టల్ రావు పటేల్ ముజామిల్ చెట్టుకింద సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రజకులపై వ్యంగ్యాస్త్రాలు ఎమ్మెల్యే దురహంకారానికి నిదర్శనం

నవతెలంగాణ-దుబ్బాక

రజకులను కించపరిచేలా తమ రజక జాతిపై వ్యంగాస్త్రాలు చేయడం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దురహంకారానికి నిదర్శనమని రజక సంఘం నాయకులు తోగుట రవీందర్ మండిపడ్డారు. బాధ్యత గల ఎమ్మెల్యే హెూదాలో ఉండి అనగారిన కులాల పట్ల ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి అక్కసు వెళ్ళగక్కాడని ధ్వజమెత్తారు. శనివారం పురపాలిక కేంద్రంలో దుబ్బాక ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ యావత్ రజక జాతికి ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రజక సంఘం నాయకులు ముత్యాల నరసింహులు,కారంకంటి రాజు,కొలిపాక బాబు, సుద్దాల కాశి,సుద్దాల రాజు,ముత్యాల మహేందర్ ఉన్నారు.



జగదేవపూర్‌లో రూ.80వేల పట్టివేత

నవతెలంగాణ-జగదేవపూర్

ఎలాంటి ఆధారాల్లేకుండా తీసుకెళ్తున్న రూ.80వేల నగదును పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం రాత్రి జగదేవపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. అయితే ఈ సమయంలో అమర్‌రామ్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాల్లేని రూ.80వేలను తన వాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరూ కూడా రూ.50వేలకు మించి నగదును తీసుకొళ్లొద్దన్నారు. అంతకు మించితే దానికి సంబంధించిన పత్రాలు వెంబడి తీసుకెళ్లాలన్నారు. లేని యెడల ఆ డబ్బులను సీజ్ చేస్తామన్నారు. ఆ డబ్బులను కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామన్నారు. సదరు బాధితుడు అక్కడికి వెళ్లి అధికారులకు.. డబ్బులకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు చూపించి రిలీజ్ చేసుకోవచ్చన్నారు. కాగా వాహన తనిఖీలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జుంలాల్ నాయక్‌కు సన్మానం

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గూగులోతు జుంలాల్ నాయక్‌కి గిరిజన నాయకులు, గిరిజన ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శనివారం హుస్నాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నునావత్ మోహన్, భాస్కర్ నాయక్,భూక్య లింగ, ధరావత్ రాజేందర్, ఎన్ లక్ష్మణ్. ఎస్ కువార్ యాదవ్, లావుడియా రాజు,ఎన్ శ్రీనివాస్, పిట్టల శ్రీకాంత్, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడు మృతి

- తెలంగాణ వచ్చేదాకా చెప్పులు వేసుకోని వైనం..
- చిదిమేసిన పేదరికం.. బతుకంతా అందాకారం
- చెందాలతో అంత్యక్రియలు పూర్తి

నవతెలంగాణ-రాయపోల్



తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న తరుణంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం 2009లో తెలంగాణ ప్రకటన చేసి ఆంధ్ర నాయకుల ఒత్తిడి వల్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో, అప్పుడు తెలంగాణ సబ్బండ వర్గాలు ఉద్యమంలో పాల్గొని రాష్ట్రం సాధించిన విషయం తెలిసిందే. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన ఇప్ప కరుణాకర్ తెల ంగాణ రాష్ట్రం సిద్ధించే వరకు చెప్పులు వేసుకోనని శపథం పూనుకొని ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అలాంటి ఉద్యమకారుడు ఇప్ప కరుణాకర్(30) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. వారికి గ్రామంలో ఎలాంటి ఆస్తుపాస్తులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొని బతుకు బండి సాగించాడు. అయితే తెలంగాణ రాష్ట్రం రావాలని కోరుతూ తెలం గాణ ఉద్యమంలో పాల్గొంటూ 2009లో తెలంగాణ వచ్చేదాకా కాళ్లకు చెప్పులు వేసుకోనని శపథం చేశారు. అన్నట్లుగానే కరుణాకర్ తెలంగాణ వచ్చిన తర్వాతనే చెప్పులు వేసుకొని తిరిగాడు. ఉద్యమస్ఫూర్తి గల కరుణాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో మండల కేంద్రంలో తీవ్ర విషాదం నెలకొ ంది. మృతునికి భార్య మమత తో పాటు ఇద్దరు వృద్ధులను తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబ జీవనోపాధి కోసం కరుణాకర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించాడు. కాగా గత కొన్ని రోజుల నుంచి ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రిలో కుటుంబీకులు చికిత్స చేయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శనివారం గాంధీ ఆసుపత్రిలో కరుణాకర్ మృతి చెందాడు. అందరితో కలగలుపుగా ఉండే కరుణాకర్ మృతి చెందడం పట్ల గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో చందాలు వేసుకొని అంత్యక్రియలు చేయడం తీవ్రంగా కలిసి వేసింది.

తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కరుణాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో నాయకులు మాత్రం ఎవరు కూడా కనికరించలేదు. తెలంగాణ స్వరాష్ట్రంలో కూడా ఆయనకు న్యాయం జరగలేదు. తెలంగాణ వచ్చేదాకా చెప్పులు వేసుకోను అంటూ తనవంతు ఉద్యమ సహకారాన్ని అందించిన కరుణాకర్‌కు ఏ పార్టీ నాయకులు కూడా ఆదరించలేదు. ఇప్పటికైనా నాయకులు కరుణాకర్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ఆదుకొని న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మున్సిపల్ మాజీ చైర్మెన్ సోదరుడి మృతి బాధాకరం

నవతెలంగాణ-జహీరాబాద్



మున్సిపల్ మాజీ చైర్మెన్ తన్జీమ్ సోదరుడు మహమ్మద్ మూస మృతి బాధాకరమని ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ హమ్మద్ తన్వీర్ అన్నారు. గడి ప్రాంతంలోని నివసిస్తున్న మహమ్మద్ మూస శనివా రం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రి యల్లో పట్టణ పుర ప్రముఖులతో పాటు వివిధ పార్టీల నాయకులు మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొని నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నామ రవి కిరణ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పచ్చి వడ్లను రూ.2000కు కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ ఉమ్మడి మండలంలోని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు పచ్చి వడ్లకు రెండువేల రూపా యలతో కొనుగోలు చేయాలని రక్షణ సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆరుకాలం కష్టపడి పండించి వడ్లు అమ్ముకోవాలనుకుంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలు లేక మద్దతు ధర దక్కట్లేదని ఆరోపించారు. వ్యాపారస్తులు పచ్చి వడ్లను రూ.1850కి కొనుగోలు చేస్తూ, పొడి వడ్లను రెండు వేలకు కొనుగోలు చేస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం దారుణ మన్నారు. వడ్ల కొనుగోలు చేయడంలో క్వింటాలుకు 3 కిలోలను దోపిడీ చేస్తున్నారన్నారు. హమాలి ఖర్చు, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు, నగదు ఖర్చు, జీఎస్టీ అంటూ నగదులో కోత విధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఇట్టి అక్రమ కొనుగోలను సంబంధిత అధికారులు ఆపకపోతే రైతుసంఘాల పక్షాన అడ్డుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్ స్కాలర్షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని.. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజినీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా 6వ మహాసభను రాయల్ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మహేష్ ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజినీకాంత్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్ హాజరై మాట్లాడుతూ.. చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు అనే నినాదంతో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ అహర్నిశలు కృషి చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికొదిలేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. రూ.7200 కోట్ల పైచిలుకు పెండింగ్స్ స్కాలర్షిప్స్, రియంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. వాటిని విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. గత తొమ్మిది నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల్లో డైట్ బిల్లులు విడుదల చేయలేదన్నారు. సంక్షేమ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయని.. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.3500 కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని.. గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు అరికట్టే విధంగా చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినందుకు 11,000 పైచిలుకు ఉద్యోగా లకు మెగా డీఎస్సీ వేసిందని, దీనికి ఎటువంటి న్యాయ పరమైన ఆటంకాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభు త్వంపై ఉందన్నారు. కేజీబీవీలు, గురుకులాలు, ఆశ్రమ పాఠ శాలల్లో తీవ్రమైన సమస్యలు ఉన్నాయన్నారు.రాష్ట్ర ప్రభు త్వం ఏర్పడి 3 నెలలు గడుస్తున్నా విద్యారంగాన్ని సమీక్ష చేయడానికి కనీసం విద్యాశాఖ మంత్రిని కేటాయెంచ కపోవ డం సిగ్గు చేటన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్క రించ కుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్, ఆఫీస్ బేరర్స్ రాజేష్, సతీష్ వాని, నేహారెడ్డి, శ్రీనివా స్, స్వప్న, శ్రీనివాస్, హరీష్, పవన్, విష్ణు, రవి, కిరణ్ గౌడ్, ప్రశాంత్, వివిధ మండల ప్రతినిధులు పాల్గొన్నారు.



యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసస్

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఆటాపాటలతో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభించి పోతిరెడ్డిపల్లి చౌరస్తా మీదుగా సీఎస్ఐ చర్చి వరకు ఘనంగా నిర్వహించారు. యూసీఎఫ్, యూసీవైఎఫ్ అధ్యక్షులు రూబిన్‌రెడ్డి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీజీఐసీసీ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పాల్గొని క్రైస్తవ సోదరులకు ముందస్తు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్ ఇన్నారెడ్డి భక్తులకు దైవ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యు లు సునీల్ నిర్మల్, సల్మోహన్, వినయ్, ఫిలిప్,రాజు, అమృ త్ రాజ్, సునందరావు, ప్రేమ్, ఆనంద్, శివకుమార్, బం టి,నాని అన్ని చర్చిల ఫాస్టర్లు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలోనే బీఆర్ఎస్ బలంగా ఉంది

నవతెలంగాణ-చేర్యాల



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో పుట్టిన బీఆర్ఎస్ పార్టీలోకి ఎంతోమంది వచ్చారు.. వెళ్లారు తప్పా చివరికి పార్టీ అలాగే ఉందని.. కేసీఆర్ నాయకత్వంలో ఇం కా బలంగా తయారయిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి జింకల పర్వతాలు అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. అధికార దాహంతో కేకే, కడియం శ్రీహరిలు పార్టీ మారుతున్నారని.. వారి పోయి నంత మాత్రాన పార్టీకి నష్టం ఏం లేదన్నారు. కడియం లేకముందే స్టేషన్ ఘనపూర్‌లో కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగురవేశామన్నారు. కడియం శ్రీహరి పార్టీ మార డంతో ఆయన భవిష్యత్‌ను ఆయనే నాశనం చేసుకు న్నారన్నారు. కేసీఆర్‌ను కాదని వెళ్లిన ప్రతీ ఒక్కరికి శంకరగిరి మాన్యాలు తప్పా.. పుట్టగతులు ఉండవన్నారు. కేకే లాంటి నాయకులకు కేసీఆర్ అందలం ఎక్కించి పక్కనే పెట్టుకుని ఆయన కూతురుకి పదవులు ఇస్తే.. పార్టీ మారడంతో తెలంగాణ ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. పార్టీ నుంచి పదిమంది నాయకులు పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని, కేసీఆర్ నాయకత్వంలో కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకోవడం తెలుసన్నారు. ఎప్పటికైనా తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే అది బీఆర్ఎస్, కేసీఆర్ నాయకత్వంలోనే జరుగుతుందన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంతిరెడ్డిగారి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప బస్తీకి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు బస్వరాజ్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ నెల సందర్భంగా ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ను ఏర్పాటు చేయడం ముఖ్యం గా బస్వరాజు కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఖాజీపల్లి కిరణ్, రాజేందర్,సిరాజ్,తౌఫిక్,అంగ్రాజ్, సాయి,మహాదేవ్,సునీల్, నగేష్, షాబాజ్, వంశీ, శివ పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో ఎరువులు అందిస్తాం



నవతెలంగాణ-రామచంద్రాపురం

రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువులు అందిస్తామని పీఏసీఎస్ చైర్మెన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి తెలిపారు. తెల్లాపూర్ పీఏసీఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం వెలివెల రైతువేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు, రుణాలు సకాలంలో అందించి ధాన్యాన్ని కొలుగోలు చేస్తామన్నారు. అనంతరం మెంబర్‌షిప్ తీసుకున్న రైతులకు షేర్ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లచ్చి నాయక్, మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ వనజ పండరి తల్లి అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు అలీ, మండల పార్టీ అధ్యక్షులు రాంసింగ్, ఎంపీటీసీ అంజయ్య సాగర్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రామ్‌రెడ్డి, బేతయ్య తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్ సునీల్

నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ సునీల్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులో సునీల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మెన్ బుచ్చిరెడ్డి, భానూరి అంజిరెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ అగ్రికల్చర్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెదక్ జిల్లా టీఎన్జీఓస్ కార్యదర్శి ఎం.రాజ్‌కుమార్ ఎలక్షన్ అధికారిగా.. మెదక్ పట్టణంలోని స్థానిక తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం భవన్‌లో ఈ ఎన్నికలు నిర్వహించారు. తెలంగాణ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం మెదక్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా ఎస్.శాంతకుమార్, కార్యదర్శిగా, ఏ.మల్లేశం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా, ఉప్పరి సురేష్, ట్రెజరర్‌గా నగేష్, ఉపాధ్యక్షులుగా ఎం.ఏ. రషీద్, డి. గోవింద్, ఎస్. రమాదేవి, సిహెచ్.శ్రీనివాస్, సిహెచ్.నిఖిల్ కుమార్, కే.భరత్, సంయుక్త కార్యదర్శిగా ఎం.స్వప్న ఎస్.పవన్, ఎం.రాజు, వెంకటరమణ రెడ్డి, ఏ.వరప్రసాద్, ఎం.డి. సద్దాం హుస్సేన్ అలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా .ఏ. హరికుమార్ గౌడ్ .పబ్లిక్ సిటీ సెక్రటరీగా. టి.రాజేందర్‌గౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మినిస్టర్ ఉద్యోగుల సంఘం కేంద్ర సంఘం మాజీ అధ్యక్షులు.ఏ. శ్రీహరి, తెలంగాణ అగ్రికల్చర్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు కృష్ణ రావు, మాజీ ట్రెజరర్ శ్యాంసుందర్, మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ.విఠల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



కనీస వేతనాలకోసం కరపత్రాలు పంపిణీ

నవతెలంగాణ-జిన్నారం

కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన ఖాజీపల్లిలో టీఐడీసీ పరిశ్రమ పరిసర ప్రాంతంలో పలువురు కార్మికులు, సీఐటీయూ శ్రేణులు శనివారం కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పారిశ్రామిక ప్రాంతంలోని ప్రతీ కార్మికుడికి కనీస వేతనం అందేలా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ శ్రేణులు,టీఐడీసీ పరిశ్రమ కార్మికులు, కార్మికనాయకులు పాల్గొన్నారు.



వట్‌పల్లిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ విజయవంతం

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రమైన వట్‌పల్లిలో నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ ర్యాలీ విజయవంతమైంది. శనివారం ఉదయం ప్రేయర్ టవర్ చర్చి పాస్టర్ దైవజనులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ చర్చి నుంచి కూరగాయల మార్కెట్ రహదారి మీదుగా జహీరాబాద్ అల్లాదుర్గం రహదారి వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం వద్దకు చేరుకున్నది. ఆయా మండలాల్లో నుంచి రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న దైవజనులు దైవ సందేశాన్ని బోధించారు. పాటలు, ప్రసంగాలు, బోధనలు ప్రజలను ఆకట్టుకునే విధంగా సువార్త సందేశాన్ని వినిపించారు. అల్లాదుర్గం, రేగోడు, రాయికోడ్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల దైవ పరిచర్యను పాలుపంచుకున్న దైవ సేవకులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ పొందిన ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ సన్మానం



నవతెలంగాణ-సంగారెడ్డి

గడిచిన 41 ఏండ్లుగా పోలీసుశాఖలో ఉత్తమ సేవలందించి, పదవి విరమణ పొందుతున్న ఎస్ఐ సుభాష్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణలకు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కొండాపూర్ మండలంలోని తొగర్‌పల్లి గ్రామానికి చెందిన కాగా సుభాష్ 1983లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకమై ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహించి.. అధికారుల మన్ననలు పొందారు. అంచలంచలుగా ఎదుగుతూ 2014లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసుగా పదోన్నతి పొంది సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖలో, జహీరాబాద్, సీసీఎస్, సంగారెడ్డిటౌన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లలో విధులు నిర్వహించారు. ప్రజల కు అందుబాటులో ఉంటూ ప్రజలలో వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందారు. అలాగే సత్యనారాయణ 1990లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకమై ఉమ్మడి మెదక్ జిల్లా, సంగారెడ్డి జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహించి, అధికారుల మన్ననలు పొందారు. ఆయన అందించిన ఉత్తమ సేవలకు గాను హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుభాష్ ఎస్ఐ, సత్యనారాయణ హెడ్‌కానిస్టేబుల్ పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావాల్సిన అన్నిరకాల బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. పోలీస్ శాఖ తరపున వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు.ఎస్పీ ఎ.సంజీవ రావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, సూపరింటెండెంట్స్ అశోక్, వెంకటేశం, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు అందరి ఎన్నికల శిక్షణ షెడ్యూలును సవరించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఒక పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ ఒకేరోజు ఎన్నికల శిక్షణ ఇచ్చే షెడ్యూలును సవరించాలని.. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై పరిపాలనా అధికారి పరమేశ్వర్‌ను టీపీటీఎఫ్ బృందం శనివారం కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చాలా పాఠశాల్లోని ఉపాధ్యాయులందరికీ ఒకే రోజు ఎన్నికల శిక్షణకు హాజరుకమ్మని ఉత్తర్వులు అందాయని.. దీని వల్ల పాఠశాల నిర్వహణ ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఒక పాఠశాలలోని ఉపాధ్యాయులకు సగం ఒకరోజు, మరో సగం ఉపాధ్యాయులకు మరొకరోజు ఎన్నికల శిక్షణ ఇవ్వాలని, ఒక పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉంటే, అదనపు పోలింగ్ సిబ్బందిని కేటాయించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ముఖ్య ఎన్నికల అధికారి జారీ చేసిన నిర్ణయించిన నిబంధనల ప్రకారం ఒకే విధానంగా రెమ్యునరేషన్ చెల్లించాలని, ఫారం 12 సమర్పించిన ఎన్నికల సిబ్బంది అందరికీ జవాబుదారీ పద్ధతిలో పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని కోరారు. గర్భిణీ ఉద్యోగులకు, పాలిచ్చు తల్లులకు, అంగవైకల్యం గలవారికి, వ్యాధులతో బాధపడుతున్నవారికి, పోలింగ్ తేదీకి దగ్గరగా తమ పిల్లల పెళ్ళిల్లు ఉన్నవారికి ఎన్నికల విధుల నుండి మినహాయింపునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, నాయకులు ఆనందంలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-కొండాపూర్

పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని.. అలాగే వారికి ఈఎస్ఐ, పీఎఫ్ యూనిఫామ్, బ్లౌజులు, శానిటైజర్, సబ్బులు ఇతరత నిత్యవసర వస్తువులు అందజేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ చంద్ర ప్రకాష్‌కి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కే.రాజయ్య మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో గత కొన్ని నెలలుగా వేతనాలు కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. నిరంతరం గ్రామపంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి ప్రతినెలా జీతాలు ఇవ్వకపోవడంతో.. వారి కుటుంబ కూడా అనేక ఇబ్బందులు పడుతున్నదన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, యూనిఫామ్ సబ్బులు సరుకులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ డివిజన్ నాయకులు బి.వెంకయ్య, మండల అధ్యక్షకార్యదర్శులు సంజీవులు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-జహీరాబాద్

ఇటీవల ప్రమాదవశాత్తు గ్యాస్ సిలెండర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందిన విషయం విధితమే. కాగా బాధిత కుటుంబాన్ని ఎరుకల సంఘం బాధ్యులు, మానవతావాదులు శనివారం పరామర్శించి రూ.35వేల ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందించారు. జహీరాబాద్ పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు విధికి చెందిన ఎరుకల లక్ష్మయ్య కోడిగుడ్లు ఉడక పెడుతుండగా.. గ్యాస్ ప్రమాదం సంభవించి.. లక్ష్మయ్య, ఆయన కోడలు, మనుమరాలు తీవ్రంగా గాయపడ్డారు. వారు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా లక్ష్మయ్య, చిన్నారి కీర్తి మృతి చెందింది. లక్ష్మయ్య కోడలు సుగుణ ప్రస్తుతం కోలుకుంటున్నారు. అయితే ఆ బాధిత కుటుంబానికి సాయం చేయాలనే ఉద్దేశంతో నగదుతోపాటు నిత్యవసర సరుకులను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల సంఘం జహీరాబాద్ తాలూకా అధ్యక్షుడు మదుగొండ మహేష్, శివరాజ్, నిమ్మల కిష్టయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బరూర్, దత్తాత్రి ముదిరాజ్, అశోక్, నారాయణ, పెంటన్న, తుకారాం, రాజు, శ్రీనివాస్, సంతోష్ తదితరులున్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించిన కొండాపురం జగన్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎనిమిదో సారి విజయం సాధించిన విష్ణువర్ధన్‌రెడ్డిని జిల్లా కోర్టులో గల ఆయన ఛాంబర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండాపూరం జగన్ శనివారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి జిల్లా కార్యదర్శి చెల్ల సురేష్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన ఎస్పీ



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా గ్రంథాలయాన్ని ఎస్పీ చెన్నూరి రూపేష్ శనివారం సందర్శించి, పోటి పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోటీతత్వంతో నిండిన నేటి సమాజంలో కఠినంగా శ్రమిస్తేనే విజయాలను అందుకోగల మన్నారు. ఒక నిర్దిష్టమైన టైమ్ టేబల్ పెట్టుకుని పోటీ పరీక్షలకు సన్నద్ధం అవ్వాలని అభ్యర్థులకు సూచించారు. గతంలో వచ్చిన మోడల్ పేపర్స్ ప్రాక్టీస్ చేయాలన్నారు. మనపైన మనం ఎప్పుడు నమ్మకాన్ని కోల్పోవద్దని, ఉద్యోగం సాధించగలమన్న నమ్మకంతో చదవాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదివి ఉద్యోగం సాధిస్తే జీవితాంతం సంతోషంగా ఉండవచ్చు అన్నారు. అనంతరం అభ్యర్థులతో గ్రంథాలయం నందు ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుకొని, జిల్లా పోలీసు శాఖ తరపున పోటి పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థుల కోసం వాటర్ డిస్పెన్సర్, స్టడీ ఛైర్ లను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంబడి సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్ఐ క్రాంతి కుమార్, గ్రంథలయం ఇంచార్జ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ చిద్విలాస్ కూరపాటికి పీహెచ్‌డీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ హైదరాబాద్‌లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి చిద్విలాస్ కూరపాటిని డాక్టరేట్ వరించింది. 'క్రోమోన్ డెరివేటివ్ల సంశ్లేషణ: భవిష్య క్యాన్సర్ నిరోధక కీమోథెరపీ పద్ధతి అభివృద్ధి, జీవ మూల్యాంకనం' అనే అంశంపై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ జి.రాంబాబు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ పరిశోధనలో జీవశాస్త్రపరంగా మరుకెన్న సహజ ఉత్పత్తి అయిన పొంగరోటిన్ ఉత్పత్తికి నూతన సింథటిక్ మార్గాన్ని కనుగొనడమే గాక స్పిరో-క్రోమోన్ హైడ్రాక్సిమిక్ యాసిడ్ డెరివేటివ్‌ను రూపొందించి, సంశ్లేషణ చేసినట్టు తెలిపారు. హెచ్ డీఏసీ-6, 8 ఎంజైమ్‌లకు వ్యతిరేకంగా వాటి జీవసంబంధ కార్యకలాపాలను విశ్లేషించారన్నారు.నానోమోబార్ సాంద్రతల్లో ఈ ఎంజైలపై గణనీయమైన నిరోధక ప్రభావాలను ప్రదర్శించే మూడు సమ్మేళనాల ఆవిష్కరణకు దారితీసినట్టు తెలిపారు. గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, పలువురు కూరపాటిని అభినందించారు.

దౌల్తాబాద్ రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్ళే ఆర్అండ్‌బి రోడ్‌ను నాలుగు లైన్ల రహదారిగా విస్తరణ చేయాలని సీపీఐ(ఎం) నాయకులు బి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో శనివారం జరిగిన సీపీఐ(ఎం) సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పటాన్‌చెరు నుంచి దౌల్తాబాద్ వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్‌ను విస్తరింప చేయాలన్నారు. ఇంద్రేశం, ఐనోల్, పేదకంజర్ల గ్రామాల పరిధిలో ఆర్అండ్‌బీ రోడ్ పూర్తిగా గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ రహదారి మార్గంలో ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, ఇతర భారీ వాహనాలు నిత్యం వెళ్తుంటాయన్నారు. వాటికి తోడు విల్లాలు, అపార్ట్ మెంట్‌లు పెద్ద యెత్తున నిర్మాణం జరుగుతున్నందున భారీ నుండి అతి భారీ వాహనాలు కంకర, మట్టీ, ఇటుక,ఇసుకను తీసుకెళ్తున్నాయన్నారు. దాంతో బచ్చుగూడ చౌరస్తా, ఇంద్రేశం పంచాయతీ మూల వద్ద వాహనదారులు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. ఈ సమస్యలను ఏ ఒక్క ప్రజా ప్రతినిధి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిత్యం వాహనదారులు ఏదో ఒకచోట ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మరమత్తులు చేపట్టి రహదారి విస్తరణ పట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు మూర్తి, జయకుమార్, చంద్రకిరన్, వెంకటేశ్వరరావు, సత్తిరాజు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్రను జయప్రదం చేయండి



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ మాలమహానాడు అధ్యక్షులు డా.అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2నుంచి 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించను న్నారు. అందులో భాగంగా ఏప్రిల్ 7న సంగారెడ్డిలో ఈ యాత్ర కొనసాగుతుందని.. కాబట్టి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు నీరుడి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సంగారెడ్డి పట్టణంలో జాతీయ మాలమహానాడు రాజ్యాంగ పరిరక్షణ యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మాల మహానాడు ఇంచార్జి ఊరట్ల శివ,మెదక్ జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ, మెదక్ జిల్లా యువజన అధ్యక్షులు నరేష్, నర్సాపూర్ పట్టణాధ్యక్షులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఖాజిపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన కాజీపల్లిలో 181 సర్వే నెంబర్ కు చెందిన ప్రభుత్వ భూవయిల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను జిన్నారం మండల రెవెన్యూ బృందం కూల్చివేసినట్లు తహసీల్దార్ బిక్షపతి తెలిపారు. ఈ మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ బృందం కూల్చివేతల కార్యక్రమాన్ని చేపటిందన్నారు. ప్రభుత్వ భూములు అక్రమ నిర్మాణాలు చేపడితే కటింగ్ చర్యలు తీసుకుంటామని కబ్జారాయుళ్లను తహసీల్దార్ బిక్షపతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ బృందం హెచ్చరించింది. కాగా దాదాపు 8 వరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్టు తహసీల్దార్ బిక్షపతి తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన, అక్రమ నిర్మాణాలు చేపట్టినా చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు.

కిష్టాపూర్‌లో గంగమ్మకు బోనాలు ఊరేగింపు

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కొల్చారం



మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మకు బోనాల పండుగ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. మంజీరా నది ఒడ్డున ఉన్న గంగమ్మ దేవాలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గ్రామస్థులు బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల కాశీనాథ్, జెడ్పిటిసి సభ్యురాలు ముత్యంగారి మేఘమాల సంతోష్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, మాజీ సర్పంచులు గోదావరి, యాద గౌడ్, యాదయ్య, ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు ఊశయ్య, కార్యదర్శి కే పోచయ్య కోశాధికారి ఎన్ పోచయ్య, సభ్యులు అంజయ్య దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. ......

కేసీఆర్ చేసిన మోసానికి కాంగ్రెస్ పార్టీ వైపు మదన్ రెడ్డి

మండల వైస్ ఎంపీపీ విశ్వంభర స్వామి

నవతెలంగాణ-చిలిపిచేడ్



కేసీఆర్ చేసిన మోసానికి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చిలిపిచెడ్ మండల వైస్ ఎంపీపీ విశ్వంబర స్వామి అన్నారు. శనివారం ఆయన నవతెలంగాణ తో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు బాల్యమిత్రుడు టిడిపి నుంచి రాజకీయ మిత్రుడు నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిని కేసీఆర్ మోసం చేశారన్నారు. మదన్ రెడ్డిని కక్షపూరితంగానే ప్రజా సేవలో ఉండకుండా చూడాలని కేసీఆర్ ముమ్మర ప్రయత్నాలు చేశారని ఆయన మండిపడ్డారు. కెసిఆర్ మిత్ర దోహానికి పాల్పడ్డారని ఇది చూసి నర్సాపూర్ ప్రజలు భరించలేరని, మదన్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తానని ఇవ్వకపోవడం పట్ల నర్సాపూర్ నియోజకవర్గ కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు మదన్ రెడ్డి వెంబడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు.

ఖజానా కార్యాలయంలో నేడు యధావిధిగా సేవలు

జిల్లా ఖజానా అధికారి చిన్న సాయిలు



నవతెలంగాణ-మెదక్ : మెదక్ కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలోని సేవలు ఆదివారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు యధావిధిగా కొనసాగుతాయని జిల్లా ఖజానా అధికారి చిన్న సాయిలు తెలిపారు. 2023-24వ ఆర్థిక సంవత్సరం చివరి రోజు అయిన సేవలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. బడ్జెట్ బిల్లులు, ఉద్యోగుల జీతాలు, చెక్కుల జమ లాంటి సేవలందించబడతాయని తెలిపారు. అలాగే నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్‌లో ఉన్న ఎస్టిఓ కార్యాలయాల్లో కూడా యధావిధిగా సేవలందించబడతాయన్నారు.

న్యాయం కోసం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

నవ తెలంగాణ..నిజాంపేట్



గత మూడు రోజుల క్రితం తనను కొట్టి కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన తాజా మాజీ ఉపసర్పంచ్ కొమ్మట బాబు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. తనను దూషించిన నిందితులను అరెస్టు చేయాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని నిందితులను కఠినంగా శిక్షించి తనకు న్యాయం చేయాలని బాబు కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని బక్కి వెంకటయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పోలీట్ బ్యూరో చైర్మన్ మెదక్ జిల్లా ఇన్చార్జి ర్యాకం శ్రీరాములు, దుబాసి సంజీవ్ ,గరుగుల సుధాకర్, జాల పోచయ్య, బండారి ఎల్లయ్యా, తదితరులు పాల్గొన్నారు

విచారణ చేపట్టిన డిఎస్పి

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో గత మూడు రోజుల క్రితం రోడ్డు విషయంలో జరిగిన గొడవ విషయంపై శనివారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంపై విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల డిపార్టెంట్ ఆఫీసర్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ పది పరీక్షలు శనివారంతోప్రశాంతంగా ముగిసాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇద్దరు వైద్యులు పదిమంది ఇన్విజిలేటర్లు ఒకరు సిఎస్‌గా బాధ్యతలు చేపట్టారన్నారు. పదవ తరగతి పరీక్షలకు మండల వ్యాప్తంగా ఏడు పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం 106, తెలుగు మీడియం 69, మొత్తం 175 మంది విద్యార్థి విద్యార్థులు హాజరయ్యారని ఒక్కరు కూడా గైర్హాజర్ కాలేదని పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయన్నారు.

దళితుడిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

నవతెలంగాణ-నిజాంపేట్



దళితుడి భూమిని కబ్జా చేసెందుకు ప్రయత్నించి అడ్డుకున్న దళితుడిపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శనివారం నిజాంపేటలో బాధితుడు కొమ్మాట బాబును శంకర్ పరామర్శించి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రెయిన్‌బో వెంచర్‌కు దారి తీసుకొవడానికి దళితుల భూమిని కబ్జాకు ప్రయత్నం చేయడం తగదన్నారు. భూమిలో నుంచి జెసిబితో అక్రమంగా దారి తీయడాన్ని ప్రయత్నించగా, నిందితులు మొయినొద్దిన్, ఎక్బాల్, నసిరోద్దిన్,అబ్జల్‌లు కలిసి మూకుమ్మడిగా దళితుడైన బాబుపైన దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే స్థాయికి దిగజారి మాట్లాడుతున్నారు

నవతెలంగాణ-దుబ్బాక



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తన స్థాయికి దిగజారి మాట్లాడుతున్నారని, ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి రఘునందన్ రావు కాలి గోటికి సరితూగరని బీజేపీ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, గత నాలుగు నెలలుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు తాళం ఉందని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావుపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో బిజెపి శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. రఘునందన్ రావును విమర్శించే నైతిక హక్కు ప్రభాకర్ రెడ్డికి లేదన్నారు. బీజేపీ నాయకులు సుంకోజి ప్రవీణ్, పెంటం కిషన్, బాచి, సప్తగిరి, రాజు, గుండబోయిన స్వామి, మల్లికార్జున్, గాజుల భాస్కర్,పెద్ది నవీన్, శ్రీకాంత్ యాదవ్, నక్క శీను, చాకలి రాజు, యాదవ రెడ్డి,పెంట మహేష్ పలురున్నారు.

వివాహానికి నగదు అందజేత

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాముల పర్తి గ్రామానికి చెందిన ముని గడప కళమ్మ-చిన్న పోచయ్యల కవలలైన ఆడబిడ్డల పెళ్ళిళ్ళకు తిర్మలన్న యువసేన ఆధ్వర్యంలో రూ.10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజా మాజీ సర్పంచ్ పద్మ నర్సింహులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్రాంతి కుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు డి. బాలకృష్ణ, నాయకులు నాగరాజు, చెక్కలి మల్లేష్, రాజయ్య, దేగల స్వామి, ములుగు.పరశురాము ఊలే కుమార్. కొండని ప్రశాంత్‌లు ఉన్నారు.

తాళం వేసిన నాలుగు ఇండ్లల్లో చోరీ

నవ తెలంగాణ-మిరుదొడ్డి



తాళం వేసిన నాలుగు ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మిరుదొడ్డి మండలం అల్వాల లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి మండలం అల్వాలలో శుక్రవారం రాత్రి నీరటి అనసూయ తాను నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో ఉంటున్న తన కుమారుడైన సంతోష్ ఇంట్లో నిద్రించడానికి వెళ్ళింది. ఈ సమయాన్ని అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి బీరువాలోని రూ.58 వేల నగదుతో పాటు తులం బంగారు ఆభరణాలను అపహరించారు. గ్రామానికి చెందిన కేశవ చారి, భాస్కరాచారి, నర్సింలు అనే వ్యక్తులు పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. దీంతో ఆ ఇంటి తాళాలు పగలగొట్టి కేశవాచారి ఇంట్లో రూ.10 వేల నగదును, భాస్కరాచారి, నర్సింలు ఇండ్లలో సైతం దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్ లు పరిశీలించారు.

రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటన ప్రసారం చేయడం సంబంధిత, అభ్యర్థి ప్రచార వ్యయంలో లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయపార్టీల ప్రకటన వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ చానల్స్‌లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలన్నారు. వార్తా పత్రికలు, ఈ పేపర్లు, టెలివిజన్ ఛానళ్లు, స్థానిక కేబుల్ నెట్వర్కు, సోషల్ మీడియా, మూవీహౌస్‌లు సంక్షిప్త సందేశాలు ఇతర ఆడియో వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలు ఎంసిఎంసి నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఎన్నికలు నిష్పక్షపాతంగా సజావుగా నిర్వహించేందుకు మీడియా సహకారం అవసరమని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రకటనలు ప్రసారం చేయవద్దని అట్టి వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటన పరిశీలించి పేడ్ న్యూస్ పరిశీలన కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎంసిఎంసి మీడియా సెంటర్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

ప్రతి పౌరుడి ఆయుధం సి-విజిల్ యాప్

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సి-విజిల్ యాప్ ప్రతి పౌరుడి ఆయుధమని తెలిపారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫోటోలు, లైవ్ వీడియోలను సి - విజిల్ యాప్ ద్వారా తీసి పంపాలని, సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదు లపై వంద నిమిషాలలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని, లైవ్ ఫోటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్లోడ్ చేసే సమయంలో జీపిఎస్ ఆన్‌లో ఉంచాలన్నారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా ఆటోమేటిగ్గా లోకేషన్ నమోదు అవుతుందని, సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత కామెంట్స్ చేసిన, పార్టీ అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు లాంటి వివరాలను, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై లైవ్ ఫోటోలు, వీడియోలు సి - విజిల్ యాప్ ద్వారా పంపాలన్నారు. యువత సి-విజిల్ యాప్ ను ఉపయోగించి ఎన్నికల్లో జరిగే అక్రమాలను, ఉల్లంఘన లను తమ దృష్టికి తీసుకుని రావాలని, 24 గంటలు కలెక్టరేట్ కార్యాలయంలోని సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నుంచి సి-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను, సెల్ నెంబర్‌లు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

ప్రలోభాలకు గురి చేస్తే 1950కు ఫోన్ చేయాలి

వివిధ రాజకీయ పార్టీలు, లేదా అభ్యర్థులు చేసే ప్రలోభాలు నగదు, మద్యం, చీరలు, వస్తువుల లాంటి సంబందించిన పిర్యాదులను 1950 టోల్ ఫ్రీ కి ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు, వివిధ ప్రచార వాహనాలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు, మైక్‌లు, లౌడ్ స్పీకర్లు, బ్యారికేడ్స్, హెలికాప్టర్ లాండింగ్, లాంటి అన్ని రకాల అనుమతుల కోసం సువిధా ఆన్ లైన్ పోర్టల్‌లో ధరఖాస్తు చేసుకోని అనుమతి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపర్డెంట్ హర్దీప్ సింగ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, నోడల్ అధికారులు ఎలక్షన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు

- హాజరైన మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు, నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజారెడ్డి
- ఆకట్టుకున్న శకట భ్రమణాల ప్రదర్శన
- భారీగా తరలివచ్చిన భక్తులు
- నల్ల పోచమ్మ నామస్మరణతో మారుమోగిన తునికి

నవతెలంగాణ -కౌడిపల్లి





జిల్లాలో రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన తునికి నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం బండ్ల ఊరేగింపు నేత్ర పర్వంగా కొనసాగింది. ఉత్సవాల్లో పాల్గొన్న మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జాతర ఉత్సవాలను పురస్కరించుకొని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు నర్సాపూర్ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ కమిటీ అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు

ఆకట్టుకున్న బండ్ల ప్రదర్శన

తునికి జాతర మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది బండ్ల ఊరేగింపు కార్యక్రమం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఎడ్లబండ్లను దూరాన్ని బట్టి ఆలయ కమిటీ సీరియల్ నిర్వహిస్తారు. అందంగా ముస్తాబు చేసిన బండ్లను ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ వేడుకలు తిలకించేందుకు వివిధ జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి వీటిని తిలకించిన ఆనంద పునీతులు అవుతారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

జాతర ఉత్సవాలు పురస్కరించుకొని ఉదయం అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అమృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ పూజారులు శివప్ప, రాజేష్‌లో నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు తమ కోరికలు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి ముడుపులు కట్టారు. అలాగే గండ దీపం తీసి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయ పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో వెలిసిన వివిధ దుకాణాలలో మహిళలు చిన్నారులు యువకులు యువతులు వస్తువులు కొనుగోలు చేస్తూ రంగులరాట్నాలు పుష్పక విమానాలు వివిధ చదరంగపు ఆటలను ఆడి సెలవు తీరుతారు.

సకల సౌకర్యాలు ఏర్పాటు

భక్తుల సౌకర్యం కోసం ఆలయ ఈవో మోహన్ రెడ్డి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం మెడికల్ క్యాంపు, ఆలయ వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సోమన్న గారి రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ సాజిద పాష, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తాళ్ల శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్ చారి, నారాయణరెడ్డి, రాములు, పర్వతాలు, మహేందర్ నాయక్, బిక్షపతి, లక్ష్మీనారాయణ గౌడ్, సునీత మహేష్ నర్సాపూర్ మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు, గ్రామ పెద్దలు యువకులు, వివిధ గ్రామాల, భారీగా తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణ చేపట్టాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణకు సంబంధించి ఎన్నికల సంఘం నిబంధనలు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలసి జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించినప్పుడు లేదా ప్రచురించినప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేర్లు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్లు ప్రింట్ లైన్ యందు స్పష్టంగా సూచించాలన్నారు. ముద్రించబడిన ప్రతులను (ప్రింటెడ్ మెటీరియల్ కాపీలను) 3 అదనపు ప్రింట్‌లతో పాటు ప్రింట్ చేసిన మూడు రోజుల్లోపు ప్రచరణ కర్త నుంచి పొందిన డిక్లరేషన్‌తో సహా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం నందు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127(ఏ) ప్రకారం పంపాలని తెలిపారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌లు ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, మొదలైన వాటి ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రోఫార్మాలో సెక్షన్ 127 ఏ (2) ప్రకారం ప్రచురణకర్త నుంచి డిక్లరేషన్ పొందాలని, డిక్లరేషన్‌పై ప్రచురణకర్త సంతకం, సూచించిన ఇద్దరు వ్యక్తులచే ధ్రువీకరించబడాలని తెలిపారు. దీనిని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమాని ధ్రువీకరించాలన్నారు. ప్రింటర్ మెటీరియల్ డిక్లరేషన్‌తో పాటు సూచించిన ప్రొఫార్మాలో ముద్రించిన డాక్యుమెంట్ కాపీల సంఖ్య సదరు ప్రింటింగ్ పనికి వసూలు చేసిన ధరకు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రింటర్లు మూడు రోజుల్లోపు అందించాలని, అట్టి ప్రతి ముద్రించిన మూడు రోజుల్లోపు ముద్రించిన ఎన్నికల కరపత్రాలు పోస్టర్లు మొదలైన వాటికి సంబంధించిన సమాచారాన్ని ప్రింటర్ ఒకేసారి కాకుండా విడిగా అందించాలన్నారు. ఈ ఆదేశాలు ఉల్లంగిస్తే చట్ట ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్ రద్దు చేయడంతో సహా ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

ఎంపీగా పోటీ చేసేందుకు ఉద్యమకారుల్లో ఎవరూ లేరా

సునీత రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఖాయం
ఎంపీ టికెట్ కేటాయించడంలో మదన్ రెడ్డికి మోసం
మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు

నవ తెలంగాణ-నర్సాపూర్



బీఆర్ఎస్ పార్టీలో మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసిన ఉద్యమకారుల్లో ఎవరు లేరా అని. కోట్ల ఆస్తులు ఉన్న వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ను కేటాయించిందని బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విమర్శించారు. శనివారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రఘునందన్ రావు హాజరై మాట్లాడారుజ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతోమంది ఉద్యమించారని వారిని మరచి బీఆర్ఎస్ పార్టీ స్థానికేతరుడైన మాజీ కలెక్టర్ వెంకట్రాం రెడ్డికి మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ టికెట్ ఇస్తామని మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి మాజీ ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిలకు బీఆర్ఎస్ అధిష్టానం ఆశ చూపి టికెట్ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు కుంభకోణాల పార్టీలన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడం ఖాయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమించిన ఉద్యమకారులు మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ, బీరయ్య యాదవ్ లాంటి వ్యక్తులను మరచి కోట్ల ఆస్తులున్న వారికి మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వడం సరికాదన్నారు . దేశ ప్రజలందరూ మూడవసారి మోడీని ప్రధానమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారని తనను మెదక్ ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపా గారి రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ రాజేందర్ కౌన్సిలర్లు బుచ్చేష్ యదవ్.సంఘసాని సురేష్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నాయకులు బలరాజ్, శంకర్, చంద్రయ్య, కొత్త శ్రీనివాస్ గుప్తా కార్యకర్తలు తదితరలు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో వెల్దుర్తి పీఏసీఎస్ ముందంజ

అభివృద్ధి బాటలో వెల్దుర్తి పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ అనంత రెడ్డి

నవతెలంగాణ- వెల్దుర్తి



ఉమ్మడి జిల్లాలో వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి బాటలో ముందంజలో ఉందని సొసైటీ చైర్మన్ అంత రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయంలో వార్షిక మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో సిద్దయ్య డైరెక్టర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి బాటలో పయనించడానికి అందరి సహాయ సహకారాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. వెల్దుర్తి మాసాయిపేట్ దామరంచ శెట్టిపల్లి కలాం కుకునూర్ తదితర గ్రామాల్లో గోదాములు నిర్మించుకొని ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి ఎంతో ఉపయోగంలో ఉన్నాయన్నారు. వెల్దుర్తిలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. సహకార సంఘంలో నిర్వహించే వార్షిక మహాజన సభకు రైతులు కూడా అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 1506 టన్నుల యూరియా, 1340 టన్నుల కాంప్లెక్స్, 497 బ్యాగుల ఫాటోస్, ఎరువులు రైతులకు అమ్మడం జరిగిందన్నారు. ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వానకాలం, యాసంగి, సీజన్లో 9410 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ మురళి డైరెక్టర్లు రమేష్ చందర్ కిష్టా గౌడ్ పోతిరెడ్డి నర్సింలు అమృత మానెమ్మ రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాలను తనిఖీ

నవతెలంగాణ-చేగుంట



జరగబోయే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయింది. ఎన్నికలు సజావుగా జరపడానికి భద్రతలను కట్టుదిట్టం చేశారు. చేగుంట మండలంలోని మక్క రాజుపేట, గజ్వేల్ వెళ్లే దారి, అలాగే బోనాల ,కొండాపూర్, దారులలో ఎస్సై 2 మల్లారెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై2 మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశానుసారం వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. జరగబోయే ఎన్నికలలో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా ఎన్నికలు సజావుగా జరపడానికి తనిఖీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల శాఖ నిర్దేశాల ప్రకారం రూ.50 వేల పై చిలుకు డబ్బు తరలిస్తుంటే ఆ డబ్బుకు సంబంధించిన తగిన ధ్రువ పత్రాలు వెంట ఉండాలని, లేనిచో ఆ డబ్బును జప్తు చేయడం జరుగుతుందని, అక్రమంగా మద్యం తరలించినా, నిలువ ఉంచినా, ఓటర్లకు ప్రలోభాలకు గురి చేయాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకూడదని, ఓటు హక్కు ఆయుధం లాంటిదని, ప్రజలు స్వచ్ఛందంగా తమ నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఎక్కడైనా అక్రమ మద్యం, డబ్బు నిల్వ ఉంచినట్టు తెలిస్తే, ఓటర్ లను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నిస్తే తమకు సమాచారం అందించాలని, తాము తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

నవతెలంగాణ-దుబ్బాక

పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిసినట్లు దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో భాగంగా చివరి రోజైన శనివారం జరిగిన సాంఘిక శాస్త్ర పరీక్ష లో భాగంగా పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. దుబ్బాక పురపాలిక పరిధిలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 814 మంది విద్యార్థులకు 813 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారని, అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో 107 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షలు విజయవంతంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఎండల తీవ్రత దృష్ట్యా పనివేళలు మార్పు



నవతెలంగాణ -నంగునూరు

ఎండ తీవ్రత దృష్ట్యా పంచాయతీ కార్మికుల పనివేళలు మార్పు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వి.చంద్రకళ తెలిపారు. శనివారం నంగునూరు గ్రామ పంచాయతీలో (మల్టీపర్పస్ వర్కర్) గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేయాలన్నారు. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తల మీద కాటన్ టవల్ చుట్టుకుని, స్టీల్ బాటిల్‌లో 1 లీటర్ మంచి నీళ్లలో కొంచెం ఉప్పు, కొంచెం చక్కెర, నిమ్మకాయ కలిపిన నీటిని వెంట తీసుకుని రావాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పది ప్రధాన పరీక్షలు



నవతెలంగాణ-నంగునూరు

మండల పరిధిలోని మూడు కేంద్రాల్లో పదో తరగతి ప్రధాన పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిసాయని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు. రాజ గోపాల్ పెట్ పరీక్ష కేంద్రంలో 158 మంది విద్యార్థులు, నంగునూరు పరీక్ష కేంద్రంలో 103 మంది విద్యార్థులు, అక్కెనపల్లి మోడల్ స్కూల్ లో 102 మంది విద్యార్థులు మొత్తం 363 మంది విద్యార్థులు ప్రతి రోజూ 100 శాతం హాజరై పరీక్షలు రాశారని తెలిపారు. ఏప్రిల్ 1న అక్కెనపల్లి మోడల్ స్కూల్లో ఒకేషనల్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణకు సహకరించిన పరీక్ష కేంద్ర అధికారులు, ఇన్విజిలేటర్లకు, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పోస్టల్ శాఖ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మల్లన్న ఆలయ అభివృద్ధి పనుల్లో మాజీ చైర్మన్‌కు భారీగా ముడుపులు

- ఆలయ నిధుల కుంభకోణంపై ప్రస్తుత చైర్మన్ మౌనం విడాలి
- దాసారం గుట్ట రోడ్డు కు రూ 4.5 కోట్లు దుర్వినియోగం
- 55 గదుల, క్యూ కాంప్లెక్స్ గుత్తేధార్ నుంచి మాజీ చైర్మన్‌కు భారీగా ముడుపులు
- ప్రస్తుత చైర్మన్ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద గత పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులలో భారీ అవినీతి జరిగిందని ఆలయ మాజీ చైర్మన్‌కు భారీగా ముడుపులు ముట్టాయని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టిన, 55 గదులు, క్యూ కాంప్లెక్స్, దాసారం గుట్టపైకి వేసిన రోడ్డు పనుల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. కాంట్రాక్టర్ నుంచి ఆలయ మాజీ చైర్మన్‌కు భారీగా ముడుపులు ముట్టాయన్నారు. పనుల కాంట్రాక్టులకు సంబంధించిన ఫైళ్ల పై ఆలయ ఈవోకు సంతకం చేసే అథారిటీ ఉంటుందని, కానీ అందుకు భిన్నంగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అండదండలతో మాజీ చైర్మన్ అ ఫైళ్లపై సంతకాలు చేయాలని ఫైళ్లను తన దగ్గర పెట్టుకొని కాంట్రాక్టర్ నుంచి డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. భక్తులు హుండీల్లో వేసిన కానుకల డిపాజిట్లను అభివృద్ధి పేరుతో విడిపించి గత పాలకమండలి కోట్ల రూపాయలు వృధా చేసిందని మండిపడ్డారు. ఆలయ భూముల నుంచి మట్టి తవ్వి దాసారం గుట్టకు పోసి రూ.4.5 కోట్లు మల్లన్న సొమ్ములు పట్ట పగలు కొట్టేసారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ చైర్మన్ చేసిన అవినీతి అక్రమాలను, ప్రస్తుత చైర్మన్ పట్టించుకోకపోవడంపై ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గత పాలకమండలి చేపట్టిన అన్ని అభివృద్ధి పనులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు తాజామాజీ సర్పంచ్ తాడురి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడురి మల్లేశం, నిల బిక్షపతి , చింతల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నవవధువులకు పుస్తె మట్టెలు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాముల పర్తి గ్రామానికి చెందిన మునిగడప కళమ్మ-పోశయ్య దంపతుల కూతురులైన కవలలు కళ్యాణి, కల్పన వివాహానికి పుస్తె మట్టెలను మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్రోళ్ల రవి, నర్సింలు, శ్రీగిరిపల్లి కృష్ణ, చెక్కలి నర్సింలు, స్వామి, నర్సయ్య, మల్లేష్, పులిందర్, మునిగడప మల్లేష్, పోచయ్య, రాజు, తదితరులున్నారు.

ఖాజీపూర్ ముదిరాజులకు సొసైటీ సభ్యత్వాలు ఇవ్వాలి



నవతెలంగాణ-తొగుట

ఖాజీపూర్ ముదిరాజులకు సొసైటీ సభ్యత్వాలు ఇవ్వాలని మండల అధ్యక్షుడు ఉల్లెంగల సాయి కుమార్ ముదిరాజ్ కోరారు. శనివారం జీవో నెంబర్ 98/1964 ప్రకారం తెలంగాణ ముదిరాజ్ మహా సభల ఆధ్వర్యంలో మిరుదొడ్డి మండలం ఖాజీపూర్ గ్రామ ముదిరాజులకు సొసైటీ ఎన్నికలతో పాటు నూతన సభ్యత్వాలను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మన్ చౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభల కార్యనిర్వాహన కార్యదర్శి దమ్మిగారి కనకయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు యమ ధర్మా, తొగుట మండల అధ్యక్షుడు ఉల్లెంగల సాయికుమార్, దుబ్బాక మండల అధ్యక్షుడు తోట్ల మల్లేశం, దుబ్బాక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మడ బోయన రాజు, ఖాజీపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు రమేష్, జంగిటి మలయ్య తదితరులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-సిద్దిపేట

రంజాన్ మాసం సందర్భంగా హైద్రాబాద్‌కు చెందిన ఆర్ఆర్ సంస్థ జకాత్ ద్వారా సరుకుల పంపిణీ చేస్తుంటారని, సిద్దిపేటలో ఆగిపోయిన పంపిణీని పంచే విధంగా చర్యలు తీసుకోవాలని టి.పి.సి.సి మైనార్టీ డిపార్ట్మెంట్ మాజీ వైస్ చైర్మన్ ఎం.డి.వహీద్ ఖాన్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన తంజీమ్ కమిటీకిగానీ, అధ్యక్షులకుగానీ, కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ కమిటీలో ప్రతి పార్టీకి చెందిన వారు సేవ చేస్తూనే ఉంటారని తెలిపారు. కమిటీ అధ్యక్షులు, ఇతర పార్టీకి చెందిన వారిచ్చిన ఫిర్యాదుకు, పంపిణీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గంలో రంజాన్ మాసంలో జకాత్ పంపిణీలు జరుగుతూనే ఉన్నాయని, సిద్దిపేటలోనే నిలిపివేశారన్నారు. అధికారులకు ఆదేశాలిచ్చి నిత్యావసర సరుకులను పేద ప్రజలకు పంపిణీ చేయాలని కోరినట్లు తెలిపారు.

వరుసగా దొంగతనాలు.. భయంతో గ్రామస్తులు

- మూడు నెలల వ్యవధిలో నాలుగు సార్లు దోపిడీ



నవతెలంగాణ-మిరు దొడ్డి

వరుస దొంగతనాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇంటికి తాళం వేసాము కదా, లేదంటే పోలీసులు పెట్రోలింగ్ చేస్తారులే అనుకుంటే పొరపాటే.. రాత్రి సమయంలో తాళం వేసి, ఎక్కడికైనా వెళ్లారో, వచ్చేసరికి ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు డబ్బులను దోచేస్తున్నారు దొంగలు. ఇది ఎక్కడో కాదు సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక నియోజకవర్గంలో జరుగుతున్న వరుస దొంగతనాలు. దుబ్బాక నియోజకవర్గంలో గత మూడు నెలల వ్యవధిలో నాలుగు సార్లు దొంగలు బీభత్సం చేశారు. తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడ్డారు. గత రాత్రి మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో తాళాలు వేసిన ఐదు ఇండ్లలో చోరీకి పాల్పడి నగదు, వెండి, బంగారం నగలతో దొంగలు ఉడాయించారు. గత మూడు నెలల క్రితం ఇదే గ్రామంలో మూడు ఇండ్లలో దొంగతనానికి పాల్పడ్డారు. ఇదే తరహాలో గతంలో దుబ్బాక మండలం తిమ్మాపూర్, తొగుట మండల కేంద్రంలో తాళం వేసిన ఇండ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. ఇలా వరుస దొంగతనాలతో దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా తయారైంది. దొంగతనం జరిగిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నప్పటికీ దొంగలు మాత్రం దొరకడం లేదు. పోలీసులు దొంగలను పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అట్టహాసంగా ఆధ్యా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

విద్యార్థులు విద్యతో సమాంతరంగా అన్ని రంగాల్లో రాణించాలని సిద్దిపేట అర్బన్ మండలం ఎంఈఓ యాదవ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆధ్య పాఠశాల రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యా పాఠశాల యాజమాన్యం మాధవి లత రవీందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా అనుపమ, సౌజన్యలు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోంది

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో సాగుచేసిన పంటలు ఎండు ముఖం పడుతున్నందున మల్లన్న సాగర్ నుంచి పంట కాలువల ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరుబావుల్లోని నీరు వట్టిపోతున్నాయన్నారు. సాగునీరు లేక పోవడంతో సాగుకు పెట్టిన పెట్టుబడి దక్కడం లేదన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రులు స్పందించి రైతులకు సాగునీరు అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడవెల్లి వాగు జీవధారగా మారిందని గుర్తు చేశారు. పంట కాలువల ద్వారా దుబ్బాక నియోజకవర్గంతో పాటు మెదక్ నియోజకవర్గాల రైతులకు సైతం సాగునీరు అందించాలన్నారు. పంట కాలువల ద్వారా సాగునీరు అందించకపోతే రైతుల పక్షాన నిలబడి ధర్నాలు రాస్తారోకోలు చేస్తామన్నారు.

వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-నంగునూరు

మెదక్ బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. జేపీ తండా సర్పంచ్, తెలంగాణా గిరిజన సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భూక్యా బిక్షపతి నాయక్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు గోవిందారం రవి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డిలు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఉండి పదవులు పొంది నేడు పార్టీ వదిలి వెళుతున్న దొంగలు ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్, హరీష్ రావు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి పి. వెంకట్రామిరెడ్డి సిద్దిపేట జిల్లాలో కలెక్టర్‌గా మనకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కేసీఆర్, హరీష్ రావుల నాయకత్వంలో ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పెంబర్తి అనిల్ యాదవ్, పుట్ట మల్లేశం, కిష్టయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాభివృద్ధి



నవతెలంగాణ-మిరు దొడ్డి

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జోగ్గరి భాస్కర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికంగా ఎంపీ సీట్లు కాంగ్రెస్ పార్టీకి దక్కుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కేసీఆర్ హయాంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో నిధులన్నీ దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల్లోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి

- డీసీఎస్ తనూజ



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర పొందాలని డీసీఎస్ఓ తనుజ అన్నారు. శనివారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో విశాల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో, మండలంలోని పోతారం గాగ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీఎస్ఓ తనుజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యానికి ఏ గ్రేడ్ రూ. 2203, బి గ్రేడ్ రూ. 2183 ల మద్దతు ధర ఇస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కార్యదర్శి , సహకార సంఘం సీఈవో తిరుమల ,సివిల్ సప్లై డిఎం హరీష్ , డిపిఎం కరుణాకర్ తదితరు పాల్గొన్నారు.

పోతారంలో..

మండలంలోని పోతారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎస్ఓ తనుజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డి ఎం హరీష్, డిపిఎం కరుణాకర్, ఏ పీ ఎం శ్రీనివాస్, సీసీ రవీందర్, అశోక్,తిరుపతి, సిఎలు కనక తార, అనిత, స్వరూప, వివో అధ్యక్షులు యమున తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో పేదవారి పొట్ట కొట్టొద్దు



నవతెలంగాణ-సిద్దిపేట

పవిత్ర రంజాన్ మాసంలో తాము సంపాదిస్తున్న సంపాదన నుంచి పేద వారి కడుపు నింపడానికి తీసే జకాత్ వితరణపై అనవసర రాజకీయాలు చేసి, పేదవారి పొట్ట కొట్టవద్దని సిద్దిపేటకు చెందిన మైనారిటీ నాయకులు వజీర్, మొయిజ్, జవేద్‌లు విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సారి కూడా ఆర్ ఆర్ గ్రూప్స్ వారు జకాత్ వితరణను రాష్ట్రంలో అన్ని పట్టణాలకు పంపించినట్టే సిద్దిపేటకు కూడా పంపించారని తెలిపారు. వారు పంపిన రేషన్ సామగ్రి ఏ రాజకీయ పార్టీకి సంబంధము లేదని, అలాంటిది అనవసర రాజకీయాలు చేసి పేదోల్లా కడుపు కొట్టొద్దన్నారు. తంజీమ్ అధ్యక్షుడు ఎజాజ్ హాఫిజ్, అలాగే కాంగ్రెస్ నాయకులు కొంతమంది రేషన్ పంపిణీ చేయవద్దని కేసులు చేయడం సిగ్గుచేటన్నారు. ఆర్ఆర్ గ్రూప్ వారు మంచితనంతో పేదవారికి సహాయం చేయాలన్న ఉద్దేశ్యంతో వ్యక్తిగతంగా పంపిన జకాత్ రేషన్‌ని పేదలకు పంచాల్సిందేనన్నారు. దాదాపు మూడు వేల కుటుంబాలకు సరిపడా రేషన్ ఇప్పటికీ మదిన ఫంక్షన్ హాల్‌లో ఉందని , దాన్ని వెంటనే పేదలకు పంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల అధికారులు కూడా ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ చూపి సమస్యను పరిష్కరించి, పేదవారిని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మన్సూర్, సయీద్, గోరు తదితరులు పాల్గొన్నారు.

భావి భారత నిర్మాతలు విద్యార్థులు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ రోజా శర్మ
- ఘనంగా కాకతీయ టెక్నో స్కూల్ వార్షికోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

నేటి విద్యార్థులే రేపటి భావిభారత నిర్మాతలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రగోత్తం రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా శర్మలు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ ఈ టెక్నో హై స్కూల్ 14వ వార్షికోత్సవం శనివారం ఉపాధ్యాయ భవన్ (టిటిసి భవన్)లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రముఖ విద్యావేత్త జగ్గు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాకతీయ ఈ టెక్నో స్కూల్ అన్ని రంగాల్లో రాణించడం విశేషమన్నారు. జగ్గు మల్లారెడ్డికి విద్య వ్యవస్థలో విశేష అనుభవం ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైందని, ఒక ఉపాధ్యాయుడు దేశాన్ని అభివృద్ధి చేయడంలో ముఖ్య భూమిక వహిస్తాడన్నారు. ఒక ఉపాధ్యాయుడు ఇంజనీర్, డాక్టర్, రాజకీయవేత్త, ఇలా అన్ని రంగాల్లో రాణించే విధంగా తమ విద్యార్థులను తీర్చిదిద్దగలుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు తమ ఆటపాటలతో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, అతిథులను ఆనందింప చేశారు. విద్యార్థుల కేరింతలతో అక్కడి వాతావరణం సందడిగా మారింది. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందించారు. ఆటపాటలలో రాణించిన విద్యార్థులకు మోడల్స్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ మండల విద్యాధికారి యాదవ రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీపై వీగిపోయిన అవిశ్వాసం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల వైస్ ఎంపిపి దేవి రవీందర్ పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కొండపాక వైస్ ఎంపిపిపై అవిశ్వాసం ప్రకటిస్తూ 9 మంది సభ్యులు ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాణ పత్రం అందజేశారు. దాంతో ఆర్డీవో బన్సీలాల్ అవిశ్వాస తీర్మాణ సమావేశానికి తేది ప్రకటించారు. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సమావేశానికి 9 మంది హాజరు కావాల్సి ఉండగా ఎనిమిది మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు నిబంధనల ప్రకారం ఒక సభ్యుడు తక్కువగా హాజరు అయినందున అవిశ్వాసం వీగి పోయిందని ఆర్డిఓ బన్సీలాల్ ప్రకటించారు.

పొద్దు తిరుగుడును కొనుగోలు చేయాలి

- తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-చిన్నకోదూరు

కొనుగోలు కేంద్రంలోని పొద్దుతిరుగుడు ధాన్యాన్ని నెల రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారపు తిరుపతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పొద్దు తిరుగుడును కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్ కార్యాలయంలో ఎదుట ఆందోళన నిర్వహించిన, తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చల్లారపు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మార్కెట్లో పొద్దుతిరుగుడు పంటను పోసి నెల రోజులు గడిచినా మార్కెట్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నెల రోజుల నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. మార్కెట్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని విమర్శించారు. కనీసం మండల కేంద్రంలోనైనా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే పొద్దు తిరుగుడు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో నకిరెడ్డి బాల్రెడ్డి, రాగిరి నర్సింలు, రాపోలు శ్రీనివాస్ రెడ్డి, అంబటి పోచయ్య, బాలయ్య, నాగిరెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాసు తదితర రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో గల స్థానిక అక్షర పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి స్నేహితులకు విద్యా బోధన చేశారు. అందులో భాగంగా ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఒకరోజు వారు అనుభవించి తమ జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కోగలగాలంటే కావాల్సిన ధైర్యాన్ని నింపుకోవాల్సిన అవసరం ఉందని తెలుసుకున్నారు. ముఖ్యంగా జిల్లా విద్యాధికారిగా గర్జకుంట సంజన, మండల విద్యాధికారిగా ఎం.డి అయాన్, కరెస్పాండెంట్‌గా రోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ గా అన్విక, వైస్ ప్రిన్సిపాల్‌గా సాయి చరణ్, ఇంచార్జిగా నాగచరణ్య, వ్యవహరించగా ఉపాధ్యాయులుగా ఇంకొంత మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఒక్క రోజులో తాము వ్యవహరించిన వృత్తిపై తమ అనుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ రామస్వామి, ప్రిన్సిపాల్ సంతోషి జ్యోతి రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుదర్శన్ ఇంచార్జి రేణుక ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

మంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలోని రాజ రాజేశ్వర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మంకాలమ్మ, మాతమ్మ దేవాలయాల విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావాలని మాజీ మంతిత్రి హరీశ్‌రావుకు నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం ఎర్రవెల్లి లోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మాజీమంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుకు రెడ్డి సంఘ సభ్యులు, గ్రామ తాజా, మాజీ సర్పంచులు కలిసి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఎలా లతా -కృష్ణ, రెడ్డి సంఘం అధ్యక్షులు చల్లారం రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, సంఘ సభ్యులు భూమి రెడ్డి,ఎల్లారెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ పెద్దిరాజుల విగ్రహ ప్రతిష్ట

- కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

మిరుదొడ్డి మండలం కాసులాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవాన్ని భాస్కర్ రావు పంతులు వేదమంత్రోత్సవాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు, ఓడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ మార్గం మారు మ్రోగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముదిరాజు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అమ్మ దయతో సకల శుభాలు

అమ్మ దయతో సకల శుభాలు కలుగుతాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠతో పాటు పెద్దమ్మ పెద్దిరాజు కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అమ్మవారి దయతో పాడిపంటలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. హిందూ ధార్మిక చింతనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ పెద్దిరాజుల కమిటీ సభ్యులు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్ రావు, నాయకులు బాలరాజు , లింగం, సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, బాపురెడ్డి, దుర్గారెడ్డి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఫారూఖ్ హుస్సేన్ వ్యాఖ్యలపై ఖండన



నవతెలంగాణ-సిద్దిపేట

బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర వైస్ చైర్మన్ కలిమోద్దీన్ తీవ్రంగా ఖండించారు. శనివారం సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు ప్రతి సంవత్సరంలాగా ఆర్ఆర్ సంస్థ సిద్దిపేట పట్టణంలో సరఫరా చేస్తుందని తెలిపారు. ఏ రాజకీయ పార్టీలకు సంబంధం లేదన్నారు. ఆ సంస్థకు మేము కాంగ్రెస్ పార్టీ తరుపున స్వాగతిస్తున్నామన్నారు. కానీ కొందరు బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ది పొందుటకు చూస్తున్నారని, దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ చొరవ చూపి ప్రతి నిరుపేద ముస్లిం కుటుంబలాకు అందించాలని, కాంగ్రెస్ పార్టీ పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఓర్వలేక కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆర్ఆర్ సంస్థ పంపిణీ చేస్తున్న సరుకులకు కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం తెలుపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వహబ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు అజ్మత్, పట్టణ అధ్యక్షుడు ప్రతాపు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి



నవతెలంగాణ-బెజ్జంకి: ఉద్యోగ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద ఉద్యోగ ఉపాధ్యాయులు మాట్లాడారు. గత కొన్నేండ్లుగా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నామని, ఇప్పటివరకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించలేదన్నారు. ఇప్పటికైనా పదోన్నతుల ప్రక్రియ చేపట్టి 2010కి ముందు ఎంపికైన ఉద్యోగ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు నారోజు శంకరా చారి, రామంచ రవీందర్, రమేష్, సతీశ్ కుమార్, రఘునాథ్ హాజరయ్యారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కొండపాక: మండల పరిధిలోని కోనయ్య పల్లి గ్రామానికి చెందిన దున్నపోతుల మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ మిట్టపల్లి బుషి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 8 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉపేందర్ గౌడ్, నాయిని అంజయ్యలు పాల్గొన్నారు.

ర్యాకం శ్రీరాములు ఎన్నిక పట్ల హర్షం



నవతెలంగాణ-మిరు దొడ్డి

జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్‌గా ఎన్నికైన ర్యాకం శ్రీరాములును శనివారం అక్బర్పేట్ భూంపల్లి మండలంలో మాల మహానాడు నాయకులు సన్మానించారు. సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, ప్రధాన కార్యదర్శి జక్కుల రాజయ్య మిరుదొడ్డి మండల అధ్యక్షులు ధారస్వామి యూత్ అధ్యక్షులు రాజేందర్‌లు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల హక్కులను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దళితులకు అందే విధంగా కృషి చేయాలన్నారు. మాలలకు రావలసిన రిజర్వేషన్ ప్రతి ఒక్కరికి అదే విధంగా పోరాటం చేయాలన్నారు. అక్బర్ పేట భూంపల్లి గ్రామ అధ్యక్షులు మండల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని డిపిఎం కరుణాకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రానికి వరి ధాన్యం తీసుకువచ్చేటప్పుడు తప్పనిసరిగా పాస్ బుక్ , ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్, వ్యవసాయ అధికారులు ఇచ్చిన పంట సాగు ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం గ్రేడ్ ఏ రకానికి రూ:2,203, బి రకానికి రూ:2,183 ధర ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం నాయక్, ఏపీఎం శ్రీనివాస్, ఏఈఓలు శ్రీలత, విజయ్, ఆర్ ఐ యాదగిరి, సీసీ తిరుపతి, కార్యదర్శి జమున, సిఏలు అనిత, స్వరూప, విఓ అధ్యక్షులు, రైతులు, హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం..ఫలహారం..?



- లేని భూమికి పరిహారం ఇప్పించి ప్రభుత్వానికి కుచ్చుటోపి.. అధికార పార్టీ నాయకుడు,మాజీ ప్రజాప్రతినిధి కలిసి ఎత్తుగడ
- రూ.9 లక్షలకు కుదిరిన ఒప్పందం
- రైతుతో రూ.50 బాండ్ రాయించుకున్న మధ్యవర్తులు

ప్రస్తుత అధికార పార్టీ నాయకుడు, మాజీ ప్రజాప్రతినిధి కలిసి అధికారుల ప్రమేయంతో లేని భూమికి ప్రభుత్వం నుంచి పరిహారం అందజేసిన వైనం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లేని భూమికి మధ్యవర్తులు అధికారులతో పరిహారం అందించడానికి రూ.9 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని రైతుతో రూ.50 బాండ్‌తో పత్రం రాయించుకున్న వైనం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత అధికార పార్టీ నాయకుడు ఓ మాజీ ప్రజాప్రతినిధితో కలిసి ఎత్తుగడ వేసి ప్రభుత్వానికి కుచ్చుటోపి పెట్టడం గమనార్హం. ఒప్పంద బాండ్ పత్రం ఉదంతం అధికార పార్టీలో, సంబంధిత అధికారుల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యే, నాయకులు, సంబంధిత అధికారులు బాండ్ పత్రం ఉదంతంపై స్పందించి ఏం చర్యలు చేపడుతారో వేచి చూడాల్సిందే.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దాచారం గ్రామ శివారులో సర్వే నంబర్ 124 యందు పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం భూములు సేకరించడం..సేకరించిన భూములకు పరిహారం పంపిణీ చేయడం అవినీతి మూలలకు ప్రధాన కేంద్రం బిందువైంది. భూముల సేకరణ నుంచి పరిహారం జాబితా రూపొందించే వరకు మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, మధ్యవర్తులు చేతివాటం ప్రదర్శించి భారీగా అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత అధికార పార్టీకి చెందిన నాయకుడు, మాజీ ప్రజాప్రతినిధి కలిసి అధికారుల అండతో పరిహారం అందిన రైతుకు మళ్లీ పరిహారం అందించడానికి ఒప్పందం కుదుర్చుకుని రైతుతో బాండ్ పత్రం రాయించుకోవడం మండలంలో అధికార పార్టీ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలకు తావిచ్చారు.

బాండ్ ఒప్పంద పత్రంతో ప్రకంపనలు

పరిశ్రమల ఏర్పాటు పేరున గత ప్రభుత్వం సుమారు 386 ఎకరాల భూమిని సేకరించి తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల సంస్థకు స్వాధీనం చేసింది. ఎకరాకు రూ.10 లక్షలు పరిహారంగా అందజేయడానికి ప్రభుత్వం ధర నిర్ణయించింది. కొందరి భూ లబ్ధిదారులకు ప్రభుత్వం పరిహారం అందజేయగా మరికొందరికి పరిహారం అందించాల్సి ఉంది. మరికొందరి రైతుల పేర్లను పరిహారం అందించే జాబితాలో చోటు కల్పించాల్సి ఉంది. భూములుండి పరిహార జాబితాలో చోటు దక్కక కొందరు రైతులు ఆందోళన చెందుతుంటే.. పరిహారం తీసుకుని లేని భూమిని ఉన్నట్టుగా చూపించి ప్రభుత్వం నుంచి మధ్యవర్తుల ప్రమేయంతో కొందరు రైతులు మళ్లీ పరిహారం అందుకోవడం గమనార్హం.

మధ్యవర్తులదే పై చేయి

ప్రాజెక్టుల్లో, పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో పరిహారం కావాలా? అయితే మేమున్నమనే విధంగా ఉంది మధ్యవర్తుల వ్యవహారం. 124 సర్వే నంబర్ యందు భూ నిర్వాసితులకు పరిహారం అందాలంటే మధ్యవర్తులదే పైచేయిగా నిలుస్తోందని వాపోతున్నారు పలువురు భూ బాధితులు. నేరుగా వెళ్లీ తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తే అధికారులు పట్టించుకోవడం లేదని.. మధ్యవర్తులు ద్వార వెళ్లిన వారి సమస్యలకు అధికారులు పరిష్కారం చూపుతున్నారని అవేదన చెందుతున్నారు. అధికారులు మధ్యవర్తుల ప్రమేయంతోనే విధులు నిర్వర్తించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బాండ్ ఉధంతం

మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు దాచారం శివారులోని 124 సర్వే నంబర్ యందు ప్రభుత్వ రికార్డుల ప్రకారం సుమారు 4 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి ప్రభుత్వం సుమారు రూ.40 లక్షలు పరిహారం అందజేయాలి. ప్రభుత్వం అంతకుముందు నాలుగేకరాల భూమి పరిహారం చెల్లించింది. అధికారులు చేతివాటం ప్రదర్శించి ఈ రైతుకు లేని భూమిని పరిహారం జాబితాలో చోటు కల్పించారనే గ్రామస్తుల పిర్యాదు మేరకు కొంత పరిహారాన్ని నిలిపివేశారు. నిలిపివేసిన భూమికి పరిహారం రావాలని బాధిత రైతు అధికారుల చుట్టు ప్రదిక్షణలు చేయసాగాడు. రైతు సమస్యను పసిగట్టిన అధికార పార్టీ నాయకుడు ఓ మాజీ ప్రజాప్రతినిధి సహాయంతో రైతును ఆశ్రయించాడు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా నేనున్నానంటూ అందుకు తగిన ప్రతిఫలంగా రూ.9 లక్షలు అందజేయాలనే ఒప్పందంతో రైతుతో మధ్యవర్తులు జనవరి 14,2023న రూ.50 బాండ్ ఒప్పంద పత్రం రాయించుకున్నారు. ఎట్టకేలకు లేని భూమికి నిలిపివేసిన పరిహారాన్ని రైతుకు అందజేయడంలో మధ్యవర్తులు సఫలీకృతమవ్వడంతో పలువురు బాధిత రైతులు అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేయడం విశేషం.

ముందస్తుగా రూ.8 లక్షలు

రైతుకు ప్రభుత్వం నుంచి నిలిపివేసిన పరిహారం అందించడానికి ముందస్తుగా రూ.8 లక్షలు తీసుకుని..పరిహారం అందిన అనంతరం మరో లక్ష చెల్లించేలా రైతు నుంచి ఒప్పంద పత్రం మధ్యవర్తులు రాయించుకోవడం వారి చేతివాటాన్ని బహిర్గతం చేస్తోంది.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

దుద్దెడ పదోతరగతి విద్యార్థులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు చంద్ర భాను పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ మను చౌదరికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంబగా దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రభుత్వ టీచర్లపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా నంగునూర్ పాఠశాల జరిగిన కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో చేర్యాల పట్టణంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా శ్రీ చైతన్య పాఠశాల దాదాపు సంవత్సరం పాటు నడుస్తుందని వీటిపైనా ఎస్ఎఫ్ఐ డీఈవోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని మున్సిపల్ అధికారులు శ్రీ చైతన్య స్కూల్ సీజ్ చేశారని, సీజ్ చేసిన స్కూలు మళ్లి తెరవవద్దని కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్ కొండం సంజీవ్ కుమార్, ఆముదాల రంజిత్ రెడ్డి శేఖర్ పాల్గొన్నారు

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్



నవతెలంగాణ-వర్గల్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి యువకులను గౌరారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గౌరారం దగ్గరలోని పాములపర్తి చౌరస్తా వద్ద ఇద్దరు యువకులు అనుమానా స్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో సుమారు 60 గ్రాముల గంజాయి లభించింది. మర్కుక్ గ్రామానికి చెందిన విఘ్నేష్ (20), పాములపర్తి గ్రామానికి చెందిన రాజు (20) ఇద్దరు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఉమేష్ సింగ్ అనే వ్యక్తి వద్ద గంజాయి విక్రయిస్తూ తాము తాగుతూ మిగిలిన గంజాయిని వర్గల్, గౌరారం, చుట్టుపక్కన గ్రామాల్లోని యువకులకు అమ్ముతున్నారు. ఈ ఇద్దరి యువకులను శనివారం వారి వద్ద ఉన్న గంజాయి, మొబైల్ ఫోన్స్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712667336, 8712667340 నెంబర్‌కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.61 లక్షలు

- 15 రోజుల్లో రూ. 61 లక్షల ఆదాయం
- ఆలయంలో హుండీల లెక్కింపు





నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం ఆలయ ఈవో బాలాజీ శర్మ ఆధ్వర్యంలో హుండీలలోని కానుకలను లెక్కించారు. 15 రోజులలో మొత్తం రూ. 61,89,123 నగదు, 75 గ్రాముల బంగారు మిశ్రమం, 6.400 కిలోల వెండి మిశ్రమం, 23 విదేశీ కరెన్సీ నోట్లు, 12 క్వింటాళ్ల బియ్యం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించగా, ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ ఏ సీ శివరాజ్, పరిశీలకులుగా రాగా, సేవా సమితి మహిళలు కానుకలను లెక్కించారు . ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏ ఈ ఓ, బుద్ధి శ్రీనివాస్, ధర్మకర్తలు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

ఉద్యోగ విరమణ తప్పనిసరి



నవతెలంగాణ-నంగునూరు

ఉద్యోగ విరమణ సహజమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోన్నమొల్ల రాములు అన్నారు. శనివారం నంగునూరు మండలం పాలమాకుల ప్రాథమిక పాఠశాలలో గత 39 సంవత్సరాలుగా పార్ట్ టైం స్వీపర్‌గా పనిచేస్తున్న ముంద్రాతి మల్లయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరన్నారు. గత 39 సంవత్సరాలుగా పాఠశాలకు ఉత్తమ సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందుతున్న ముంద్రాతి మల్లయ్యను పాఠశాల సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిర, ఉమాదేవి, భూపాల్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధువులకు పుస్తే మట్టెలు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మునిగడప పోచయ్య కలమ్మ దంపతుల కూతుళ్ళు కల్పన, కళ్యాణి వివాహానికి పుస్తే మట్టెలను బీజేపీ మండల ఉపాధ్యక్షులు తాడూరి మహేష్ గౌడ్ శనివారం అందజేశారు. ఆయన వెంట బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, కెఎల్‌అర్ రాజు, సురేష్, స్వామి గౌడ్, శర్ధని మహేష్, స్వామి, స్వామి, మహేష్, శ్రీనివాస్, మంద స్వామి, సాయి గౌడ్, తదితరులున్నారు.


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని చేబర్తి గ్రామా నికి గడీల కృష్ణమూర్తి అనారోగ్యం తో ఇటీవల మృతి చెందాడు. మృతుని కుటుంబానికి బీజేపీ మండలాధ్యక్షులు సాయి రెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు తాడూరి మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్‌లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల అర్థికసాయం అందజేశారు. వారి వెంట కార్యదర్శి గంధ మల్ల చంద్రశేఖర్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి కొండ బాలకృష్ణ, కొంతం శ్రీను, దేశమైన రామాంజనేయులు, దేశమైన బాబు, కృష్ణ, బీమరి శ్రీకాంత్, శ్రీనివాస్, బాలకృష్ణ, మహేష్ తదిరులున్నారు.

నేడు ఉమామహేశ్వర దేవాలయ ప్రథమ వార్షికోత్సవం



నవతెలంగాణ-గజ్వేల్

సీతారామ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ స్వస్తివాచనము అనంతరం వరుణమంటప ఆరాధనము దేవతా ఆహ్వానము సీతారామచంద్ర స్వామికి పురుష సూక్త అభిషేకము ఉమామహేశ్వర స్వామికి రుద్రాభిషేకము, మధ్యాహ్నం 12:30 కు మహా మంగళహారతి మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి భగవంతుడి దివ్యా ఆశీస్సులు పొందాలన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి




నవతెలంగాణ-సిద్దిపేట

విద్య వ్యతిరేక విధానాలను అవలంభించిన బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా నిర్మాణ బాధ్యులు మంద పవన్‌లు కోరారు. శనివారం ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ మౌళిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)-2020 లోపాలపుట్టని, విద్యా కాషాయీకరణ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కేంద్రీకరణ కోసమే నూతన విద్యా విధానమని, ప్రజలందరూ దీనిని తిరస్కరించాలన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారన్నారు. దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చారని విమర్శించారు. దేశంలో జాతీయ విద్యా విధానం వల్ల దాదాపు 90 శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారని, విద్యా వ్యాపారీకరణ వలన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం దూరం చేస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాశారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా విధానంలో ప్రైవేటు విశ్వవిద్యాలయలను, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తారని తెలిపారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక మూడు రాష్ట్రాలు నూతన జాతీయ విద్యా విధానం తిరస్కరిస్తున్నట్లు తీర్మానం చేశాయని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా నూతన జాతీయ విద్యా విధానం వ్యతిరేకిస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశ అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా వేల్పుల ప్రసన్న కుమార్, గర్ల్స్ కన్వీనర్‌గా ఆకుల శిరీషను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగెం మధు, జేరిపోతుల జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్ లు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి సాధ్యం

- రేబర్తి సొసైటీ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

రైతుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి సాధ్యమని రేబర్తి సొసైటీ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి అన్నారు, శనివారం రేబర్తి సహకార సొసైటీలో మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వార్షిక నివేదిక పరిశీలించుట, చుట. మార్చి 2023 నుంచి మార్చి 2024 వరకు ఆడిట్ గురించి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త బైలాను పరిశీలించి ఆమోదించుట. పరపతేతర కార్యక్రమాలపై సమీక్ష, సంఘం ద్వారా సంఘ సభ్యులకు దీర్ఘకాలిక రుణాలు అందించుట, జిల్లా సహకార బ్యాంకు ద్వారా రుణాల సౌకర్యం గురించి, సంఘం ద్వారా అప్పు పొందిన బకాయిల గురించి, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాజిరెడ్డి మాట్లాడుతూ రైతుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి చెందుతుందన్నారు. ధాన్యం కొనుగోలు, యూరియా విక్రయాలపై వచ్చిన ఆదాయంతో ఒక కోటి 18 లక్షల గోల్డ్ లోన్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఎల్ టి లోన్ బకాయిలు రూ.60 లక్షలు ఉన్నట్లు ఆయన తెలిపారు. సంఘం సభ్యులకు రూ.6 కోట్ల అప్పులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో బోయిని శ్రీధర్, డైరెక్టర్లు కరెడ్ల శ్రీధర్ రెడ్డి, నారోజు శ్రీనివాస్, మేక మల్లేశం, నాలుసాని మోహన్ రెడ్డి, దేవునూరి దేవయ్య, కొండ అంజయ్య భూక్య జగన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీల రిఫరీగా దామెర ప్రేమ్ కుమార్



నవతెలంగాణ-మద్దూరు

జాతీయ సీనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు రిఫరీగా మద్దూరు మోడల్ స్కూల్ పిడి దామెర ప్రేమ్ కుమార్ ఎంపికయ్యారు. హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్‌లు శనివారం విలేకరులకు తెలిపారు. భారతదేశంలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో జాతీయస్థాయిలో 15 మంది రిఫరీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి దామెర ప్రేమ్ కుమార్, రెఫరీగా ఎంపికవడం పట్ల సిద్దిపేట జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, సిద్దిపేట హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తుమ్మల కనకయ్య మహమ్మద్ ఇంతియాజ్ హుస్సేన్, రాంగ్ సరిత, అంబాల రాము గౌడ్, కొమ్ముగవి నాచగోని వెంకట్ గౌడ్, మద్దూరు మండల హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు బోయిని మనోహర్, బూరుగు నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రభాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకన్న, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

అలయన్స్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేద అమ్మాయికి పెళ్లి



నవతెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ క్లబ్స్, వాసవి క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేద వైశ్య కులానికి చెందిన లావణ్య, రాజులకు వైశ్య భవన్లో ఘనంగా సంపూర్ణ లాంఛనాలతో వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ఆలయన్స్ గవర్నర్ సోమ వనజ, వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ బాసూరి నరసింహులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన ఆడపిల్లకు పెళ్లి చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు 300 మందికి భోజనాలు ఏర్పాటు చేసామన్నారు. అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇది పదవ పెళ్లి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్స్ ఆత్మరాములు, వైకుంఠము, అంజయ్య, వైస్ గవర్నర్లు శివకుమార్, బాలచంద్రం, రామచంద్రం, పూర్వక గవర్నర్లు క్లబ్ సభ్యులు, గంప శ్రీనివాస్, గంప కృష్ణమూర్తి, యాద శ్రీనివాస్, పుల్లూరు శివకుమార్, శశాంక్, అధ్యక్షు చకిలము రవి, యూత్ ప్రెసిడెంట్ హరి కిరణ్, పెళ్లి దంపతుల బంధువులు, వాసవి సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎం.పీ అభ్యర్థిని కలసిన నాయకులు



నవతెలంగాణ-మర్కుక్: బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని మాజీ రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బబ్బూరి సతీష్ గౌడ్, ర్యాకం స్వామిలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థిని బారి మెజారిటీ తో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో లింగ బాలలింగం, తదితరులున్నారు.

జగదేవపూర్‌లో రూ.80 వేల నగదు పట్టివేత



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేయుచుండగా ఒక వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న 80 వేల రూపాయలను సీజ్ చేయడం జరిగింది అని శనివారం నాడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ గారి ఆదేశానుసారం లోక్ సభ ఎన్నికల సందర్భంగా చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 29-03-2024 రాత్రి 7:45 గంటల సమయమున అమర్ రామ్ తండ్రి పునారామ్ తన యొక్క వాహనంలో ఎలాంటి పేపర్లు లేకుండా 80 వేల రూపాయలు తీసుకొని ప్రయనిస్తుండగా పట్టుకొని సీజ్ చేయడం జరిగింది అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు 50 వేలకు మించి ఎవరు కూడా తీసుకొని వెళ్లవద్దని సూచించారు. ఎక్కువ తీసుకొని వెళ్ళినచో తప్పకుండా దానికి సంబంధించిన పత్రాలు వెంబడి ఉంచుకోవాలని సూచించారు. లేకుంటే డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. డబ్బులను కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ కమిటీకి అప్పగించడం జరుగుతుందన్నారు. సదరు బాధితుడు అక్కడికి వెళ్లి అధికారులకు డబ్బులకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు చూపించి రిలీజ్ చేసుకోవచ్చని తెలిపారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుంది



నవతెలంగాణ-కొండపాక

బట్టి విధానానికి స్వస్తి తెలిపి పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే విజ్ఞానం పెంపొందుతుందని జిల్లా జడ్జి డాక్టర్ బి రఘురాం అన్నారు కొండపాక మండలం శాంభవి పాఠశాలలో శనివారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ సిద్దిపేట జిల్లా వారి ఆధ్వర్యంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులు పోక్సో చట్టాల గురించి పిల్లలకు తెలిపారు. పిల్లలు మొబైల్ ఫోన్స్ దూరంగా ఉండాలని మొబైల్స్ వాడకము వలన పిల్లలు మానసికంగా దెబ్బతిని మెదడు పైన ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు తెలిసి తెలియక పేస్ బుక్, ఇంస్టాగ్రామ్‌లో అనవసరమైన పోస్టింగ్‌లు పెట్టి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మొబైల్ ఫోన్స్ వాడకము వలన విద్యార్థులు చదువుపై ప్రభావం చెప్తున్న అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా విద్యార్థులు వాహనాలను నడపడము చట్టరిత్యానేరమని తెలిపారు. ఈ కార్యక్రములో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. స్వాతి రెడ్డి, సిద్దిపేట ఏ వి పి జి. మధు, సి ఐ విద్యాసాగర్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ చేసి ఓట్లు అడగాలి

- బీజేపీ మండల అధ్యక్షులు బూర్గోజు నాగరాజు



నవతెలంగాణ-కొమురవెల్లి

కాంగ్రెస్ పార్టీ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడగాలని బీజేపీ మండల అధ్యక్షులు బూర్గోజు నాగరాజు అన్నారు. శనివారం బీజేపీ కార్యకర్తలతో కలిసి రాంసాగర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు ఎట్లా అడుగుతారని ప్రశ్నించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ 2500, వృద్ధులకు, వితంతు, వికలాంగుల , పెన్షన్లను, పెంచుతామని చెప్పి నేటికీ అమలు చేయకుండా అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు కుడుకుడి మల్లేశం, దండ్యాల బిక్షపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొయ్యడ మల్లేశం గౌడ్, మండల ఉపాధ్యక్షులు మద్దికుంట కరుణాకర్, ఈగ కనకయ్య, మండల కార్యదర్శులు అక్కెనపల్లి సంపత్ రెడ్డి, తలారి నాగరాజు మండల నాయకులు మూటకోడూరు శ్రీనివాస్ చారి, ఆకుల పాండు, కొంతం రాజు, తదితరులు పాల్గొన్నారు

ప్రతీ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలి



నవతెలంగాణ-గజ్వేల్

మండల పరిధిలోని ధర్మారెడ్డి పల్లి గ్రామంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్ యూనిట్ 1 స్పెషల్ క్యాంపులో భాగంగా మూడవ రోజు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి విజయ భాస్కర్ రెడ్డి వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే విద్యార్థులు ఈ పచ్చని చెట్ల మధ్యలో విద్యను నేర్చుకోవడమే కాకుండా ప్రకృతి పురోగతికి కూడా విద్యార్థులు సహకరించాలన్నారు. తద్వారా ప్రతి గ్రామంలో కూడా ప్రకృతి బాగుంటుందని ఈ ప్రకృతియే ప్రజలందరికీ ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదం కూడా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. "విద్య ఎంత ముఖ్యమో అలాగే విద్యార్థులకు ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం" అనే హితవును పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఎస్ వాలంటీర్స్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా, ఉత్సాహంగా బ్యాగ్ లెస్ డే



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 'బ్యాగ్ లెస్ డే' మూడవ రోజు ఉల్లాసంగా, ఉత్సాహంగా, జరిగిందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. 'బ్యాగ్ లెస్ డే' లో భాగంగా 20 మంది విద్యార్థుల బృందం క్యాంపస్ క్లినింగ్, గార్డెనింగ్, పనులను పూర్తి చేశారు. తరువాత నృత్య ప్రదర్శనలో భాగంగా నృత్య కళ నిపుణులైన భవాని కుమారి నృత్యంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కళ రూపాయల ప్రదర్శనలో భాగంగా 800 చాక్ పిస్‌లతో యాదాద్రి ఆలయ నమూనాను నిర్మించారు, ఈ ఆలయ నమూనా అందరిని ఆకట్టుకుంది. విద్యార్థులు చాక్ పిస్‌లతో ఆంగ్ల అక్షరాలను తయారు చేశారు. పలు కళ రూపాలను విద్యార్థులు వేదిక పై ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.